
బొమ్మరిల్లు
జూన్ 1997
Rs
6

బొమ్మరిల్లు


సంపాదకుడు: విజయ బాపినీడు

ప్రపంచంలో వికలాంగులపైనా, రోగులపైనా, యాచకుల పైనా ఎవరో ఒకరు ఏదో సమయంలో సానుభూతి చూపించగలరు. ఆ సానుభూతి వాళ్ళ దురదృష్టాన్ని మరిపింపజేసి జీవితంలో కొత్త ఉత్సాహాన్నిస్తుంది. చెడ్డతనాన్ని మాత్రం ఎవరూ హర్షించరు. చెడ్డవాడిని అసహ్యించుకునే వారే తప్ప ఆదరించేవారుండరు. అందువల్ల మానాభిమానాలు లేనివాళ్ళు మాత్రమే చెడ్డవాళ్ళుగా మన గలరు. యాచకులు కూడా విడిచిపెట్టలేని మానాభిమానాలు విడిచిపెట్టగలగడమే చెడ్డవాడి గొప్పతనమని "చెడ్డవాడి గొప్పతనం"లో చమత్కరించారు రచయిత.

బాలల వ్యక్తిత్వాలను ఉన్నతాదర్శాల వైపు మళ్ళించే కథలకై బొమ్మరిల్లు చేస్తున్న ప్రయత్నంలో పై కథలు మచ్చు తునకలు మాత్రమే!

సంపుటి: 26 జూన్ 1997 సంచిక: 7

విడిప్రతి రూ. 6.00 సంవత్సర చందా: రూ. 72.00



నిజమైన భక్తుడు

పూర్ణదీప్తుడు అనే సాధువు హిమాలయ పర్వత శ్రేణువులు చేరాలని బయలు దేరాడు. మార్గ మధ్యంలో ఒక కీకారణ్యాం గుండా ప్రయాణంచేస్తూ అతను అలసటతో ఒక విశాలమైన వటవృక్షం క్రింద ఆశీనుడయ్యాడు. ఆ వటవృక్షం సూర్యరశ్మి చొరబడలేనంతగా ఆకులతో అలముకుని ఉంది. అది చూసిన పూర్ణదీప్తుడు, "భగవంతుడా! నీ వెంత గొప్పవాడివి?" అనుకున్నాడు.

మరికొంత దూరం పోయాక ఒక పర్వతం మీద నుంచి క్రిందకు ఉరుకు తున్న జలపాతం కనిపించింది. అది చూసిన పూర్ణదీప్తుడు, "భగవంతుడా! నీ సృష్టి ఎంత గొప్పది!" అనుకున్నాడు.

అదే సమయాన కైలాస గిరిమీద పరమేశ్వరుడు తలమునకలయ్యేంత ఆనందంలో ఉన్నాడు. అది గమనించిన పార్వతి, "నాథా! మీ ఆనందానికి కారణ మేమిటి?" అని ప్రశ్నించింది. అందుకు పరమేశ్వరుడు "దేవీ! భూలోకంలో ఒక భక్తుడు నన్నూ, నా సృష్టిని ప్రస్తుతిస్తున్నాడు" అన్నాడు. అందుకు పార్వతి, "స్వామీ! మీరొట్టి బోళా మనుషులు. అందుకే అందరూ మిమ్మల్ని పొగిడి బుట్టలో వేసు కుంటున్నారు" అంది.

"లేదు దేవీ! అతను నిజమైన భక్తుడు" అన్నాడు పరమేశ్వరుడు. 'అది నేను పరీక్షించి తేలుస్తాను' అని పార్వతి, సాధువు ప్రయాణం చేసే త్రోవలో ఒక ఊబిని సృష్టించింది. అది ఊబి అని గుర్తించక అందులో కాలిడిన పూర్ణదీప్తుడు అందులో చిక్కడిపోయి క్రమేపీ భుజాలవరకూ కూరుకుపోయాడు.

తనకు మృత్యువు సమీపించినదని గ్రహించిన పూర్ణదీప్తుడు, "భగవంతుడా! నీవెంత గొప్పవాడివి! ఇంత త్వరగా ఈ నరజన్మనుంచి విముక్తి ప్రసాదిస్తున్నావు" అన్నాడు.

పార్వతి, పరమేశ్వరుడి మాటలు నిజమేనని ఒప్పుకుని పూర్ణ దీప్తుడికి కైవల్య ప్రాప్తి ప్రసాదించింది.

— డి. శిరీష



అన్నన్‌తో ఒక కొత్త సంప్రదాయం

ప్రపంచ వ్యాప్తంగా మనమల్లో ఎన్ని కులాలున్నా, వర్గాలున్నా అసలైనవి రెండే రెండు. నాయకులు, శ్రామికులు. నాయకులు శ్రామికుల కోసం పాటుపడాలని నియమించబడతాడు. కానీ శ్రామికుల నుంచి వచ్చిన నాయకులు అరుదు. ఏ సంస్థను తీసుకున్నా ఎక్కువగా ఇదే కనబడుతుంది.

ప్రపంచ శాంతి కోసం ఏర్పడిన ఐక్యరాజ్యసమితిలోనూ ఎంతో కాలంగా ఇదే జరుగుతోంది. మొదటి సెక్రటరీ జనరల్ ట్రైగ్వేలీ నుంచి నిన్నమొన్నటి ఘాలి దాకా పేరెన్నికగన్న రాజకీయవాదులో, రాజ్యాంగవేత్తలూ అయి ఉన్నారు. సెక్రటరీ జనరల్ పదవి సామాన్య మైనది కాదు. దేశవిదేశ రాజకీయ సమస్యలపై క్షుణ్ణంగా అవగాహన ఉండాలి. ఎవరినీ నొప్పించని చతురత ఉండాలి. జటిల సమస్యలను పరిష్కరించే సమర్థత ఉండాలి. అగ్రదేశాలనూ, అల్పదేశాలనూ ఆకట్టుకోగల నేర్పు ఉండాలి. అందుకు ఏడాదికి డెబ్బైలక్షల రూపాయల జీతం. మరెన్నో సదుపాయాలు.

ఐక్యరాజ్య సమితికయ్యే ఖర్చును సంపన్న దేశాలు ఎక్కువగా భరిస్తున్నాయి. వాటిలో అమెరికా భాగం తక్కువేమీ కాదు. అందుకని అమెరికా ఐక్యరాజ్యసమితి పనితీరు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. ఇటీవల ఐక్యరాజ్యసమితి తీసుకున్న ఎన్నో నిర్ణయాలు తమకు అనుకూలంగా లేవని ఆ దేశపు ప్రముఖులు, రాజకీయనాయకులు అభిప్రాయపడుతూ - సమితి ఉద్యోగులు ఏ పనీ చేయకుండా బోలెడు జీతాలు పుచ్చుకుంటున్నారని అంటూంటారు.

కొత్త సెక్రటరీ జనరల్‌గా ఘనాదేశానికి చెందిన కోఫి అట్టా అన్నన్ నియమితులయ్యారు. ఆయన భార్య నానే స్విట్జర్లాండ్‌లో పుట్టిన మహిళ. వారికిద్దరు పిల్లలు. ఆయన వయసు 58. ప్రత్యేక విశేషమేమిటంటే ఆయన ఐక్యరాజ్య సమితిలో 32 సంవత్సరాలుగా పనిచేస్తూ చిన్న ఉద్యోగం నుంచి ఈ స్థాయికి చేరుకున్నారు. ఆవిధంగా చూస్తే - ఆయన తొలిసారిగా శ్రామికవర్గం నుంచి వచ్చిన నాయకుడు.

(ఈ శతాబ్దపు చివరి దశాబ్దం - 83)

సమితి ఉద్యోగులందరూ తమ నాయకుడు తమలోంచీ పుట్టుకొచ్చాడని పొంగిపోతున్నారు. మా మనిషి మా నాయకుడని సంబరపడుతున్నారు.

అన్నన్ సంపన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన పేరులోని కోఫిని బట్టి ఆయన శుక్రవారం పుట్టారని తెలుసుకోవచ్చు. అట్టా అన్నపదం కవలలలో ఒకటని తెలియ జేస్తుంది. ఆయన కవల సోదరి ఇప్పుడు జీవించి లేదు.


అన్నన్ చాపకింద నీరులా ఎన్నో ఘనకార్యాలు చేసి ఉన్నారు. గల్ఫ్‌యుద్ధం సమయంలో! ఆయన పాత్ర మరవు రానిది. నాటో పండితులతో ఆయన అద్భుతంగా వాదించి - యుగ్లోస్లావియోలో ఐక్యరాజ్య సమితి తీసుకున్న చర్యలను సమర్థించుకుంటూ - అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేశాడు. ఇటీవల బోస్నియాలో డేటన్ ఒప్పందం - అన్నన్ ఆధ్వర్యంలో జరిగినదే!

అన్నన్ ముందు సైన్సుకు సంబంధించిన కోర్సు చదివాడు. ఘనా నుంచి ఎకనామిక్సు డిగ్రీ సంపాదించాడు. అమెరికాలో మేనేజిమెంట్లో మాస్టర్సు డిగ్రీ సంపాదించాడు. జెనీవాలో ఉండగా ఫ్రెంచి నేర్చుకుని ఎకనామిక్సులో గ్రాడ్యుయేషన్ చేశాడు.

అన్నన్ ఆంగ్ల భాషను ధారాళంగా మాట్లాడతాడు. ఫ్రెంచివారు తృప్తి పడే స్థాయిలో ఆ భాషనూ మాట్లాడతారు. సెక్రటరీ జనరల్ పదవికి తొలి విడత పోటీల్లో ఆయనను వ్యతిరేకించిన ఫ్రాన్సు చివరకి ఆయన ఎన్నిక కాగానే, "పోనీలే, మా భాష మాట్లాడ గలిగినవాడు నియామకుడయ్యాడు" అని తృప్తి పడ్డారట.

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి పదవి సాధారణమైనది కాదు. ప్రస్తుతం ప్రపంచ మంతటా వ్యాపించియున్న అల్లకల్లోల పరిస్థితి కారణంగా ఆ పదవి మరింత కీలకమైనది. బడుగు దేశాల నుంచి - ఒక నల్లవాడా పదవిని స్వీకరించగలగడం ప్రపంచ భవిష్యత్తుకే ఆశాజనకం. అందులోనూ సమితి కార్యకలాపాల గురించి కూలంకషంగా తెలిసిన అన్నన్ ఈ పదవిని స్వీకరించడంతో - ఇలాంటి పదవుల ఎన్నికలకు కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టబడింది. కొత్త శతాబ్దానికి నడిపించబోయే "అన్నన్" సారథ్యంలో ఈ సంప్రదాయం కలకాలం కొనసాగే ఏర్పాటు జరుగుతుందని ఆశిద్దాం!

"వసుంధర"



కందకు లేని దురద కత్తిపీటకెందుకు ?

సీతాపురంలోని శివయ్యకు భీమయ్య ఒక్కగానొక్క కొడుకు. భీమయ్యకు ఆరుగురు పిల్లలు. శివయ్య భార్య పూర్ణమ్మకు మనుమలు, మనుమరాళ్ళు అంటే పంచ ప్రాణాలు. వాళ్ళనావిడ అపురూపంగా చూసుకునేది.

భీమయ్య భార్య ఈశ్వరి ఎంతో మంచిది. అత్తమామలంటే ఆమెకు ఆత్మీయతానురాగాలే కాక భక్తి శ్రద్ధలు కూడా ఉన్నాయి. అందువల్ల శివయ్య ఇల్లు ప్రశాంతతకి మారుపేరులా ఉండేది.

ఒకసారి పూర్ణమ్మకు జబ్బు చేసింది. అత్తగారిని మంచం దిగనివ్వకుండా ఎంతో శ్రద్ధగా సపర్యలు చేసింది ఈశ్వరి.

ఈ కారణంగా పిల్లల అల్లరి పెరిగింది. తల్లి, బామ్మ కూడా తమను చేరదియ్యడం లేదని వారికి కోపం. ఈశ్వరి వాళ్ళని అదుపు చేయాలని ప్రయత్నించింది. వాళ్ళు లొంగలేదు సరికదా అల్లరి ఎక్కువ చేశారు. ఇక ఓర్చుకోలేక ఈశ్వరి అందరికీ తలో రెండు తగిలించింది.

తల్లి కొట్టిందని పిల్ల లేడుస్తుంటే పూర్ణమ్మ సహించలేకపోయింది. ఆవిడ చటుక్కున మంచం దిగి పిల్లలందర్నీ దగ్గరగా ఓదార్చి కోడల్ని కాస్త గట్టిగానే కోప్పడింది.

"అసలు మీరిలా గారాబం చెయ్యడం వల్లనే వీళ్ళు నా మాట వినడం లేదు. దయచేసి పిల్లల విషయంలో మీరు జోక్యం చేసుకోకండి. నా పిల్లల్నెలా పెంచుకోవాలో నాకు తెలుసు. వాళ్ళను కొట్టుకున్నా, తిట్టుకున్నా అది నా యిష్టం" అంటూ అత్తగారి మీద విసుక్కుని పిల్లల్ని లాక్కుని వెళ్ళింది ఈశ్వరి.

పూర్ణమ్మకు మనసు చివుక్కుమంది. ఎంతో మంచిదనుకున్న కోడలు మొదటిసారిగా అలా మాట్లాడడాన్నావిడ జీర్ణించుకోలేక భర్త వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పి, "నేనేం తప్పు చేయలేదు కదా - కోడలునన్నెందుకు విసుక్కుంది?" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

శివయ్య నవ్వి, "ఇది చాలా చిన్న విషయం.

(సామెత కథలు)

పిల్లలు అల్లరి చేసినప్పుడు దండించడం మంచిది. కోడలు మంచిపనే చేసింది. అప్పుడు నువ్వు పిల్లల్ని సమర్థిస్తే - పిల్లలేమనుకుంటారు? వాళ్ళ అమ్మదే తప్పనుకుంటారు. వాళ్ళమ్మ మంచిది కాదనుకుంటారు. అయినా కోడలు చెప్పిన ఇంకో మాట కూడా నిజం. వాళ్ళు ఆమె పిల్లలు. తల్లికంటే ఎక్కువగా నువ్వు వాళ్ళని ప్రేమించ లేవు కదా! కందకులేని దురద కత్తిపీటకెందుకూ అన్న సామెత ఉండనే ఉంది. తన పిల్లల్ని కొట్టుకుందుకామెకు బాధ లేకపోతే మధ్య నీకెందుకు?" అన్నాడు.

"పోనీ - తప్పు నాదే అనుకోండి. కోడలు నన్నుకూడా విసుక్కోవాలా? పెద్దదాన్ని కదా - నామీద కాస్త గౌరవముంచి నెమ్మదిగా చెప్పొచ్చు కదా!" అని వాపోయింది పూర్ణమ్మ.


"అది నిజమే! కానీ ఇంటి విషయం చూడు. నీకు అనారోగ్యం చేయడంతో ఇంటెడు చాకిరీ కోడలి మీద పడిపోయింది. నన్ను చూసుకోవాలి. పిల్లల్ని చూసుకోవాలి. నీకు అదనంగా సేవలు చేయాలి. ఆపైన ఇంటెడు చాకిరీ. అందువల్ల కోడలికి విసుగొచ్చి ఉండాలి కానీ ఆమెకు, నువ్వంటే గౌరవం లేదా? కాసేపయ్యాక చూడు. తనే వచ్చి నిన్ను క్షమించమంటుంది" అన్నాడు శివయ్య.


"అనేవన్నీ అనేశాక క్షమించమంటే క్షమిస్తా రేమిటీ? నేను క్షమించను" అంది పూర్ణమ్మ.

అంతలో ఈశ్వరి అలావచ్చి, "ఈరోజు నాకేమైందో తెలియదత్తయ్యా! నోటికొచ్చినట్లు మాట్లాడేను. మీరు క్షమించాననే దాకా పచ్చి మంచినీళ్ళు ముట్టను" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

అప్పుడు పూర్ణమ్మ అన్నీ మరచిపోయి కోడల్ని దగ్గరగా తీసుకుని, "ఇందులో నిన్ను క్షమించ డానికేముందీ! తప్పు నాదే - నువ్వు పిల్లల్ని దండిస్తున్నప్పుడు నేను కలగజేసుకోకూడదు కదా మరి-" అంటూ ఆప్యాయంగా కళ్ళ నీళ్ళు తుడిచింది.

— జ్యోతిర్మయి





అన్యాయ ఫలం

భూస్వామి భూషయ్యకు కర్కోటకుడని పేరు. తన పొలంలో కష్టపడి పనిచేసే రైతులకాయన సరైన ప్రతిఫలాన్నివ్వడు. అదేమని అడిగితే పనిలోంచి తొలగించి కొత్తవారిని చేర్చుకుంటాడు. పూట గడవనివాళ్ళు విధిలేక ఆయన వద్ద పని చేస్తూంటారు.

అంతేకాదు, భూషయ్య పనిలోంచి తప్పించిన వారిని వేరెవ్వరూ పనిలో పెట్టుకుందుకు వీల్లేదు. ఆయన తుంటరి అని తెలుసు కాబట్టి ఊళ్ళో వాళ్ళెవరికీ ఆయన్నెదిరించే ధైర్యం లేదు.

కొన్నాళ్ళకు భూషయ్యకేదో జబ్బు చేసింది. వైద్యుడు వచ్చి అన్ని పరీక్షలూ చేసి, "అయ్యా! మీరు బాగా లావు చేశారు. కొంతకాలం పాటు బాగా శరీర శ్రమ చేయాలి. ఒళ్ళు తగ్గేదాకా జొన్న రొట్టెలు తప్ప ఇంకేమీ తినరాదు. నామాట పాటించకపోతే మీరు ఎంతోకాలం బ్రతకరు. పాటిస్తే మరిన్ని సంవత్సరాలు బ్రతుకుతారు" అని చెప్పి కొన్ని మందులిచ్చి వెళ్ళాడు.

ఆరోజు నుంచీ భూషయ్య వళ్ళంతా చెమటలు పట్టేదాకా పెరట్లో పరుగులు పెట్టేవాడు. జొన్న రొట్టెలు మాత్రమే తినేవాడు. అయితే ఊరికే పరుగులు పెట్టడం ఆయనకు విసుగ్గానూ, అలసటగానూ ఉండేది. జొన్న రొట్టెలు ఏ మాత్రమూ సహించేవి కాదు.

భార్య సుమతి దగ్గర ఆయన ఈ విషయమై గోల పెట్టాడు.

"మీరు చెప్పింది నిజమే! ఇలా పెరట్లో పరుగులు పెట్టడం వల్ల మీకు అలసట వస్తుంది. మనకు బోలెడు పొలాలున్నాయి. అక్కడ పని చేయండి. మీకు వళ్ళూ తగ్గుతుంది. విసుగూ ఉండదు" అంది సుమతి.

"ఇంత బ్రతుకూ బ్రతికి పనివాళ్ళతో కలిసి పని చేయడమా? నాకెంత అవమానం!" అన్నాడు భూషయ్య ఉక్రోషంగా.

"మీ పొలం పనులు ఇతరులు చేయగా లేనిది మీరు చేస్తే అవమానమెందుకవు

జి. జాన్ కెన్నెడీ

తుందీ?" అంది సుమతి.

భూషయ్య పొలానికి వెళ్ళి పనులు చేయ బోయాడు. ఆ పనులు చాలా కష్టమని గ్రహించేక పొలం వెళ్ళడం మాని, "నేనిక అలాంటి పనులు చేయబోను. నాకు కష్టమనిపించే పనికి పని వాళ్ళందరూ ఎక్కువ డబ్బడుగుతారు. నా ఆరోగ్యం పాడైతే కానీ - పనివాళ్ళ జీతాలు మాత్రం పెంచను" అని భార్యకు చెప్పాడు.

"న్యాయంగా ఎవరికివ్వాల్సినది వాళ్ళకివ్వాలి. లేకుంటే మన డబ్బు అన్యాయ ఫలమవుతుంది. మీరెంత సంపాదించి ఏం లాభం - కోరు కున్నవన్నీ తినలేకపోయాక?" అంది సుమతి భర్తకి నచ్చుజెపుతూ.


"మనుషుల్ని శిక్షించడానికీ రక్షించడానికీ భగవంతుడనే వాడున్నాడుగా. ఆయనే పనివాళ్ళ విషయం చూసుకుంటాడు. నేను కూడా నా ఆరోగ్యానికి ఆయన్నే ప్రార్థించుకుంటాను. నా పద్ధతులు మాత్రం మార్చుకోను" అన్నాడు భూషయ్య.

అప్పుడు సుమతికి ఉక్రోషం వచ్చి, "ఇతరుల కన్యాయం చేస్తూ పెంచిన వళ్ళు పిశాచాలు పీక్కు తినడానికి తప్ప ఇంకెందుకూ పనికి రాదని మా నాన్న అనేవాడు. మీరు మీ పద్ధతులు మార్చుకోండి" అంది.

భూషయ్య ఏదో అనేలోగా దబ్బున వారి ముందు రెండు పిశాచాలు దూకి, "చాలాకాలంగా మేమీ ఇంటి నాశ్రయించుకుని ఉన్నాం. పిశాచాల్లో గౌరవంగా బ్రతుకుతున్నాం. ఏ ఇంట్లో మనిషి పోయినా - ఆ శవాన్ని చితిమీద ఉంచేక ఎవరికీ తెలియకుండా పీక్కు తినడం పిశాచాల రివాజు. కానీ భూషయ్య వళ్ళు అన్యాయ ఫలం. అది మేము పీక్కుతింటామని ఎవరనుకున్నా మాకు అవమానం. అందుకే ఈ క్షణమే ఈ ఇల్లు విడిచిపెడుతున్నాం" అని మాయమయ్యాయి.

శ్రమ జీవుల్ని దోపిడీ చేసేవాడి శరీరాన్ని పిశాచాలు కూడా ఏవగించుకుంటాయని భూషయ్యకప్పుడర్థమైంది.





శివపార్వతీయం

3

“అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో నామ నగాధిరాజః” అన్నట్లు దైవత్వం కలిగిన హిమవంతుడికి అతడి ధర్మపత్నియైన మేనకాదేవి యందు జన్మించిన కూతురు పార్వతి అనే పేరుతో పెరిగి యుక్త వయస్కురాలైంది.

ఒకసారి నారదుడు హిమవంతుడి నిలయానికి వచ్చాడు. పర్వతరాజ దంపతులు అతడికి సపర్యలు చేసి అర్ఘ్య పాద్యాదులతో పూజించారు.

కుశల ప్రశ్నలు, లోకవిశేషాలు ముచ్చటించుకున్న తర్వాత నారదుడు “పుణ్యదంపతులారా! అమ్మాయినీ మిమ్మల్నీ చూసి చాలా కాలమైంది... ఈ మధ్య భూలోకానికి రావటం వీలుకానందున మీ దగ్గరికి రాలేకపోయాను. పార్వతిని ఓ మారు చూడాలని ఉన్నది. పిలిపించండి” అన్నాడు.

మేనకాదేవి విచారస్వరంతో “స్వామీ! ప్రస్తుతం మా అమ్మాయి మానసిక స్థితి ఏమీ బాగాలేదు. మూడురోజుల్నుంచి ఓ మంకుపట్టు పట్టి కూర్చున్నది. స్నేహితురాండ్రతో మాట్లాడదట... ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూంటుందట... అసలు మాతో కూడా ముక్తసరిగా ఉంటున్నది. ఐదేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు తమరు వచ్చి ఏదో మంత్రం ఉపదేశించి వెళ్ళారు కదా? ఇదంతా ఆ మంత్ర ప్రభావమే ననుకుంటున్నాం. అమ్మాయిని మామూలు స్థితికి తీసుకురాగల శక్తి మీకే ఉన్నదనీ, మిమ్మల్ని ఇక్కడికి ఆహ్వానించమనీ, నేను నా భర్తకు చెబుతున్నాను... ఇంతలో తమరే వచ్చారు” అన్నది.

నారదుడు “పర్వత రాజపత్నీ! అమ్మాయి పట్టిన మంకుపట్టు ఏమిటమ్మా?” అన్నాడు.

హిమవంతుడు కూడా విచారం వెలిబుచ్చుతూ “అది ఎప్పుడో ముసలితనంలో కోరవలసిన కోరికను ఇప్పుడు మా అమ్మాయి కోరుతున్నది -స్వామీ! ఎక్కడికో వెళ్ళి ఈశ్వరుణ్ణి గురించి తపస్సు

కిరణ్‌కుమారి



చేస్తుందట. మేము అంగీకరించక పోవటంతో అలా ఉన్నది. చివరకు నిద్రాహారాలు కూడా విడిచిపెట్టింది'' అన్నాడు.

మేనక "నారదమునీంద్రా! తపస్సుకు వెళతానని మారాం చేస్తుంటే 'ఉ.మా' అన్నాను నేను. అంటే అర్థం తమకు తెలుసు కదా?" అన్నది.

నారదుడు నవ్వి "చదువుల రాణి ఇంట జన్మించిన నాకు బ్రహ్మ విద్యలే వచ్చు. దీనికర్థం తెలియదా! 'ఉ' అంటే 'ఓ స్త్రీ' 'మ' అంటే 'వద్దు' అని అర్థం. అంతేకదా?" అన్నాడు.

మేనక "మన అర్థం అంతేస్వామీ! కాని, మా పుత్రికా రత్నం మాత్రం 'అమ్మా! నీ నోటినుంచి వచ్చిన పదం నా పట్టుదలను ఇంకా పెంచుతూ సార్థకం కానున్నది. ఇకమీదట నా పేరు ఉమ కూడా. పార్వతీ అని పిలిచినట్లే ఉమా అని కూడా పిలవండి' అంటూ తన మొండి పట్టుదలను సమర్పించుకుంటున్నది. మీరే ఏదైనా చెప్పి, మనసు మార్చండి" అని ఓ పరిచారికను పిలిచి పార్వతిని వెంటబెట్టుకు రమ్మని ఆజ్ఞాపించింది.

పార్వతికి ఐదేళ్ళ వయస్సులో తాను ఉపదేశించిన "శివమంత్రం" ఆమె వయస్సుతో పాటు పెరిగి ఇప్పుడు మనస్సులో దృఢంగా నాటుకపోయిందని గ్రహించాడు నారదుడు... లోక శ్రేయస్సు కోరి ఆనాడు తాను చేసిన పని మంచి ఫలితాన్ని ఇచ్చే శుభసమయం సమీపించినందుకు ఆ ముని సంతోషించాడు...

పర్వత రాజదంపతులతో ఆ మాటా ఈమాటా మాట్లాడుతూన్న నారదుడికి కొంతసేపట్లోనే క్రొక్కారు మెరుపు తీగెలా, శరీర సౌందర్యాలు ఆ పరిసరాలను తేజోవంతం చేస్తూండగా - సఖితో కలిసి పార్వతి తమ దగ్గరికి వస్తూండటం కనిపించింది...

ఆ తేజోమయిని చూస్తూ మనస్సులో "తల్లీ, జగన్మాతా? విధివిలాసం విచిత్రమై నేను నీకు మార్గదర్శకం చేపట్టవలసి వచ్చింది. ఈ అల్ప జ్ఞుణ్ణి క్షమించు మాతా!" అని ప్రార్థించుకున్నాడు.

పద్దెనిమిదేళ్ళ పసిమి యౌవనంలో మిసమిస లాడుతూన్న పార్వతి వచ్చి నారదుడికి, తల్లి దండ్రులకు వినయంతో నమస్కరించింది.

నారదుడు కుడి చెయ్యి పార్వతి తల పై భాగం మీద ఉంచుతూ "శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు - దీర్ఘ సుమంగళీ భవ" అని దీవించాడు.

మేనక చిరునవ్వుతో "మీ దీవెన ఫలిస్తే మాకంతకంటె కావలిసిందేముంటుంది స్వామీ? పెళ్ళి పేరెత్తితేనే మామీద మండిపడుతున్నది" అన్నది.

నారదుడు పార్వతిని చూస్తూ "ఏం తల్లీ! ఏ వయస్సులో తీర్చుకోవాలసిన ముచ్చటలు ఆ వయస్సులో తీర్చుకోవటం జీవధర్మం. తల్లి దండ్రులు చెప్పినట్లు వివాహం చేసుకోమ్మా!" అన్నాడు.

పార్వతి వినయం నిండిన నిష్ఠూరంతో "ఈ మాట చెప్పటానికే ఇంతకాలానికి ఇక్కడికి దయచేశారా స్వామీ! నేను శివుణ్ణి గూర్చి తపస్సు చెయ్యాలి. ఆ దేవదేవుణ్ణి సందర్శించాలని నా మనస్సు ఉరకలు వేస్తున్నది. మీరందరూ ఎంత చెప్పినా నా చెవికి ఇంకే మాటలు ఎక్కవు" అన్నది.

హిమవంతుడు మృదువుగా అది కాదు తల్లీ! పల్లానికి ప్రవహించటం ప్రవాహానికెంత సహజమో, వయస్సుకొచ్చిన యువతికి వివాహ వాంఛ కలుగటం అంతే సహజం. కాని, నీ విషయంలో ఈ ప్రకృతి ధర్మం ఎందుకు అసహజమైనదో అర్థం కావటం లేదు" అన్నారు.

పార్వతి తండ్రివేపు తిరిగి "నాది అసహజమైన కోరిక కాదు నాన్నగారూ! నా యిష్ట దైవాన్ని నేను సందర్శించుకుంటున్నాను" అన్నది.

నారదుడు నవ్వి! "పోనీ తపస్సు చేసి ఈశ్వర సాక్షాత్కారం పొందిన తర్వాతైనా వివాహం చేసుకుంటావా అమ్మా?" అన్నది.

పార్వతి "ఇప్పుడా విషయం చెప్పలేను" అన్నది.





మేనక చిరాకుతో "ఏమిటే నీ మొండితనం? ముద్దుముద్దుగా అడిగే కొద్దీ మేం లోకువై పోతున్నట్లుంది. తపస్సంటే చెలికత్తెలతో కలసి ఆడుకోవటమనుకున్నావా?... చలిగాలులకు తట్టుకోవాలి... ఎండలకు ఓర్చుకోవాలి... క్రూరమృగాల బెడద నుంచి రక్షణ పొందాలి... వీటన్నిటినీ మించి లక్ష్యం మీద మనస్సు పూర్తిగా లగ్నమై ఏకాగ్రత కావాలి... ఇవన్నీ నీ వల్ల అయ్యే పనులనే అనుకుంటున్నావా?".. అన్నది.

పార్వతి "అమ్మా! ఆ దేవ దేవుడి అనుగ్రహం నామీద ఉంటే అవన్నీ నా వల్ల అయ్యే పనులే! యిక నేను యెవ్వరు చెప్పినా వినను. ఈ దినమే బయలుదేరుతాను. తపో నిష్ఠకు అనుకూలమైన ప్రదేశాన్ని ఎన్నుకుని, అన్ని కష్టాలను ఎదుర్కొని అక్కడ తపస్సు చేస్తాను' అన్నది.

నారదుడు నవ్వుతూ "నీ కోరిక ఈశ్వరుణ్ణి సందర్శించటమే అయితే నువ్వు తపస్సు చెయ్యకుండానే పరమేశ్వరుణ్ణి చూపిస్తాను. సరేనామ్మా!" అన్నాడు.

పార్వతి పరమానందంతో పొంగిపోతూ "అంతకంటే ఆనందదాయకమైనదేముంటుంది స్వామీ! మీరెక్కడికి రమ్మన్నా వస్తాను. నాకు ఈశ్వర సందర్శనం కలిగించండి" అన్నది.

నారదుడు "ఇక కొద్ది సేపటిలో మనం ప్రయాణమవుదాం. స్నేహితురాలితో కలిసి వెళ్ళమ్మా!" అన్నాడు.

పార్వతి చెలితో కలిసి అక్కడి నుండి వెళ్ళి పోయింది.

అంతవరకు వారిద్దరి మాటలను అయోమయంతో వింటూన్న పర్వత రాజదంపతులు పార్వతి వెళ్ళగానే ఆశ్చర్యంతో చూశారు నారదుణ్ణి.

మేనక "అదేమిటి స్వామీ! పసితనంతో తెలియక పార్వతి యేదో కోరితే, ఆ కోరికను మరింత సాగదీసి అసాధ్యమైన వూహను దానికి కలిగించారు. ఈ విచార సమయంలో మాతో ఆడుకోవాలను కుంటున్నారా?" అన్నది.

హిమవంతుడు కూడా "అవును నారద మునీంద్రా! మీ మాటల తీరు మాకేం అర్థం కావటం లేదు" అన్నాడు.

నారదుడు ప్రశాంతంగా హిమవంతుణ్ణి చూస్తూ, ప్రసన్న స్వరంతో "అర్థం వివరించవలసిన సమయం వచ్చినందువల్లే నేను పని గట్టుకుని

మీ దగ్గరికి వచ్చాను. నారాక మీ సమస్యనే కాక లోక కంటకమైన మరొక సమస్యను కూడా పరిష్కరించ గలదు. యింతకూ నేను చెప్పింది పార్వతీ కన్యకు పరమేశ్వరుణ్ణి చూపిస్తాననే కదా? యిక కొద్ది సేపట్లోనే ఆ ఉమాదేవి కోరిక నెరవేరుతుంది. మాతో బాటు మీరు కూడా రావాలి" అన్నాడు.

హిమవంతుడు ఉత్కంఠతతో "ఎక్కడికి? కైలాసానికా?" అన్నాడు.

"కాదు. ప్రస్తుతం పరమేశ్వర మహాదేవుడు విశ్వశక్తులను అదుపులో పెట్టుకోవటానికి, భార్య మరణాన్ని గురించిన దుఃఖం మరుగున పడటానికి, యోగ నిష్ఠలో వున్నాడు. ఆ వుండట మెక్కడో కాదు. మీ నివాసంలోనే ఒకచోట" అని నారదుడు తన మాటలకు విస్తుపోతున్న మేనకా హిమవంతులకు గతంలో జరిగిన సతీదేవి కథనంతా చెప్పాడు.

మేనక అబ్బురపాటుతో "ఆఁ? సతీదేవి శ్రీ మహావిష్ణువు సంకల్పం వల్ల మాకు పుత్రికగా జన్మించిందా? జగన్మాతను బిడ్డగా పొందిన మేము ధన్యులం." అన్నది.

హిమవంతుడు "త్రిలోక సంచారివి, సర్వజ్ఞుడవు అయిన నువ్వు యింత గొప్ప రహస్యాన్ని ఇంతకాలం నుంచి మాకు చెప్పకుండా దాచావేం తండ్రీ?" అన్నాడు.

నారదుడు "పర్వత సార్వభౌమా! దేనికైనా సమయం కలిసి రావాలి కదా? పార్వతిలో యింకా పూర్వజన్మ స్మృతి కలుగకుండా విష్ణుమాయ అడ్డుకుని వుండటానికి కూడా ఓ పరమరహస్యం వున్నది. ముమ్ముందు అవన్నీ వివరంగా మీకే తెలియగలవు. నేను దూరదృష్టితోనే పార్వతి పసితనంలో శివమంత్రం వుపదేశించాను. అది





ఇప్పుడు ఫలవంతం కానున్నది. ప్రస్తుతం నేను చెప్పినట్లు చెయ్యండి. స్థితికారుకుడైన ఆ శ్రీమహావిష్ణువే కాగల కార్యాలన్నిటినీ జరిపించ గలడు" అన్నాడు.

ఆ తర్వాత నారదుడు పార్వతిని వెంట పెట్టుకుని. మేనకా హిమవంతులతో కలిసి పరమేశ్వరుడు యోగదీక్ష వహించి వున్న ప్రదేశానికి వెళ్ళాడు.

అక్కడ —

పలువిధాల పూల తీగెలతో అల్లిబిల్లిగా అల్లుకున్న లతా మంటపాలు కన్నులపండువు చేస్తున్నాయి. గైరికాది ధాతు సముదాయం చల్లని పిల్లగాలులతో సయ్యాట లాడుతూ ఆ పరిసర ప్రదేశాన్ని ఆరోగ్యదాయకం చేస్తున్నాయి. మంచురాతి పలకల మీద జలజల పొర్లుతూ తెల్లటి స్వచ్ఛమైన జలపాతాలు మనస్సును ఆహ్లాదకరంగా మలుస్తున్నాయి.

అతి ప్రశాంతమైన ఆ ఏకాంత ప్రదేశంలో —

నీలనీరద శరీర కాంతులు దెసల వెల యిస్తుండగా పద్మాసనం వేసుకుని ఓ శిలావేదిక మీద పరమశివుడు కళ్ళు మూసుకుని బాహ్యలోకాన్ని మరిచి ధ్యాన నిమగ్నుడై వున్నాడు... విశాలమైన ఫాలభాగం విబూది రేఖలతో ప్రకాశిస్తున్నది. కనుబొమల మధ్యన పైభాగంలో మూడవకన్ను ప్రశాంతంగా మూతపడి వున్నది... తలమీద జటాజూటం కిరీటంలా భాసిస్తున్నది. రుద్రాక్ష మాలికలతో బాటు నాగాభరణం మెడలో విలసిల్లుతున్నది.

ఆ మహాదేవుని నిశ్చల యోగదీక్షను చూడగానే నారదుడితో బాటు పార్వతి కూడా చేతులు జోడించింది. మేనకా హిమవంతులు కను రెప్పలు వెయ్యకుండా పరమేశ్వరుడిని చూడసాగారు.

కొంతసేపటి తర్వాత —

నారదుడు పార్వతితో "తల్లీ! దారిలో చెప్పినవన్నీ గుర్తున్నాయిగా? ఇక మేము వెళతాం. అదిగో నీ స్నేహితురాండ్రు కూడా వస్తున్నారు. వారితో కలిసి నీ కర్తవ్యం నిర్వర్తించు. సర్వకాల సర్వావస్థలలో విష్ణుశక్తి నీ శ్రేయస్సు కోరుతూ నిన్ను కాపాడుతూంటుంది" అన్నాడు.

పార్వతి నారదుడి పాదాలకు నమస్కరించి "మీరు చెప్పినట్లే చేస్తాను స్వామీ!" అన్నది.

అనంతరం నారదుడు మేనకా హిమవంతులను వీడ్కొని నారాయణ స్మరణ చేసుకుంటూ

అంతర్థానుడయ్యాడు.

కొద్దిసేపు పుత్రికకు చెప్పవలసిన జాగ్రత్తలు చెప్పి, మేనకా హిమవంతులు కూడా అక్కణ్ణుంచి తమ నివాసానికి వెళ్ళిపోయారు... అప్పటికి తనను చేరుకున్న చెలులతో కలిసి పార్వతి కన్నార్పకుండా పరమశివుడినే చూస్తూ ముందుకు సాగింది.

బ్రహ్మవల్ల వరం పొందిన తారకాసురుడు తన సహజ క్రౌర్య స్వభావంతో అనుచరగణాన్ని వెంటబెట్టుకుని సజ్జనులను హింసించాడు! మునుల ఆశ్రమాలపై దాడులు నిర్వహించి యజ్ఞయాగాదులు చెయ్యకుండా కట్టడి చేస్తూ బాధించారు. కనిపించిన కన్నెపిల్లనల్లా చెరబట్టాడు. ఎదురుతిరిగిన వారినందరిని హతమార్చాడు.

క్రమంగా ఆ రాక్షసనాయకుడిలో అధికార దాహం ఆవహించింది. అన్ని లోకాలకు తానే అధిపతికావాలని నిర్ణయించుకున్నాడు.

వెంటనే యెక్కడెక్కడో వున్న తన మిత్రులు, బంధువులు అయిన రాక్షస రాజులకు దూతలద్వారా తన అభిమతాన్ని వివరిస్తూ తోడ్పడ వలసిందిగా కోరాడు.

అతడి కోరికను పురస్కరించుకుని ధూమ్రనేత్రుడనే రాక్షస నాయకుడు లక్షమంది రాక్షసులతో వచ్చి తారకాసురుడికి బాసటగా నిలిచాడు.

దీర్ఘబాహుడు రెండు లక్షలమంది అనుచరులతో కలిసి తారకాసురుడి నగరానికి చేరుకున్నాడు.

ఇంకా - తామ్రపర్ణుడు, దంష్ట్రా కరాళుడు, ఖడ్గరోముడు, రోమపూర్ణుడు, వజ్రముఖుడు, మొదలైన రాక్షసాధినేతలు లక్షోపలక్షల సైన్యాలతో తరలివచ్చి తారకాసురుడికి మద్దతు ప్రకటించారు.



అలా వచ్చి చేరిన బంధు మిత్రుల సైన్యాలతో తన సైన్యాన్ని కలిపాడు తారకాసురుడు. అందరూ కలిసి కోటిమందికి పైగా అయ్యారు. ఆ సైన్యాలతో తారకుడి నగరమే కాకుండా పరిసర ప్రాంతాలు కూడా నిండిపోయాయి.

— యిష్టదేవతలకు పూజలు చేసి, గురువుల ఆశీస్సులు పొంది ఒక శుభముహూర్తంలో తారకాసురుడు సైన్య సమేతంగా జైత్రయాత్ర బయలుదేరాడు.

— అది స్వర్గలోకానికి రాజధానియైన అమరావతీ నగరం. స్వర్గాధిపతియై యింద్రుడు తన వైజయంతీ సభా భవనంలో చింతామణీ పీఠం మీద కూర్చుని వున్నాడు. అష్టదిక్పాలకులు తమ తమ స్థానాలలో వుపవిష్టులై వున్నారు. నగర ప్రముఖులు సభంతా క్రిక్కిరిసి వున్నారు.

దేవ గురువైన బృహస్పతి యింద్రుడి సింహాసనం ప్రక్కగా ఓ సమున్నతమైన ఆసనం మీద కూర్చుని వున్నాడు.

ఇంద్రుడు వివిధ లోకాలకు చెందిన విషయాలను సభా సదులతో చర్చిస్తూండగా - మహతి వీణను మీటుతూ నారాయణ గానం చేస్తూ ఆ సమయంలో నారదుడు సభలో ప్రవేశించాడు.

ఇంద్రుడతణ్ణి సాదరంగా ఆహ్వానించి ఓ ఉన్నతాసనం మీద కూర్చోమన్నాడు. నారదుడు "కూర్చుని సావకాశంగా కబుర్లు చెప్పుకునే సమయం కాదిది మహేంద్రా! ముంచుకొచ్చే ముప్పును గురించి చెప్పటానికొచ్చాను' అన్నాడు.

హఠాత్తుగా నారద ముని ఆ మాటలనేసరికి సభలోని వారంతా వులికిపాటు చెందారు.

ఇంద్రుడు నవ్వి 'పరిహాసం చాలించు నారద మునీంద్రా! ప్రస్తుతం ముంచుకొచ్చే ముప్పేం లేదని మాకు తెలుసు. అప్పుడప్పుడు వచ్చే ముప్పులు కేవలం రాక్షసుల వల్లే... యిప్పుడవి యేవీ లేవు. మొన్న మొన్ననే కదా - మమ్మల్ని బాధించే మధు కైటభులను మహావిష్ణువు మట్టు బెట్టాడు.' - అన్నాడు.

(ఇంకావుంది)





చెడ్డవాడి గొప్పతనం

ఒకానొకప్పుడు వసుదేవపురంలో గోపాలయ్య అనే మధ్యతరగతి పెద్ద మనిషి ఉండేవాడు. ఆయనకు లేకలేక పుట్టిన కొడుకు గోవిందయ్య. చిన్నతనం నుంచీ వాడిది దుడుకుతనం. ఎంత చెప్పినా వినకుండా చెడ్డపనులు చేసేవాడు. వయసు పెరిగిన కొద్దీ మారకపోతాడా అని గోపాలయ్య ఆశపడ్డాడు కానీ ఇరవై ఏళ్ళొచ్చినా వాడి చెడ్డబుద్ధులు పోలేదు.

కొడుకునెలా మార్చాలా అని గోపాలయ్య సతమతమవుతున్న సమయంలో ఒకరోజున వాళ్ళింటికి - ఆయన గురువు ఆనందుడు వచ్చాడు. గోపాలయ్య గుఋవుకు నమస్కరించి తన

కరాళి కథలు



కొడుకు గురించి చెప్పుకుని బాధపడ్డాడు.

"నీ కొడుకునోసారి పిలు" అన్నాడు ఆనందుడు.

గోపాలయ్య పిలవగా గోవిందుడక్కడకు వచ్చాడు. ఆనందుడు వాడివంక కొద్ది క్షణాలు తీక్షణంగా చూసి, "గోపాలయ్యా! నువ్వు అనవసరంగా బాధపడుతున్నావు. నీ కొడుకు చెడ్డపనులు చేస్తూంటే దిగులెందుకు? మంచి కంటే చెడు చేయడమే కష్టం. కష్టమైనది చేసేవాడు జీవితంలో ఎప్పటికైనా బాగుపడతాడు" అన్నాడు.

దీనికి గోవిందయ్య ఎంతో సంతోషించి తండ్రి వంక నిరసనగా చూసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

"మీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. మీరే ఇలాగంటే ఇంక వాడు బాగుపడే అవకాశం లేనేలేదు" అని వాపోయాడు గోపాలయ్య.

ఆనందుడు కోపంగా గోపాలుడి వంక చూసి, "అయితే నువ్వు నా మాటల్నే శంకిస్తున్నావన్న మాట!" అన్నాడు.

"లేకపోతే తమబోటి పెద్దలనాల్సిన మాటలేనా ఇవి? మంచి అనిపించుకోవడం కష్టం కానీ చెడు అనిపించుకునేందుకు క్షణం కూడా పట్టదని మీకు తెలియదా?" అన్నాడు గోపాలయ్య.

"మాట్లాడుకునేందుకైతే నీ అభిప్రాయం నీది. నా అభిప్రాయం నాది. ఋజువు చేయాలనుకుంటే నువ్వీ విషయంలో నాకూ, నీ కొడుక్కూ కూడా నిదర్శనాలు చూపించాలి" అన్నాడు ఆనందుడు.

గోపాలయ్య వెంటనే వెళ్ళి కొడుకుని పిలిచాడు. విషయం చెప్పాడు. ఆనందుడు తనతో ఏకీభవిస్తున్నాడని తెలియగానే గోవిందయ్యకుత్సాహం వచ్చింది. ఈ దెబ్బతో తండ్రి చేత మాటలు పడే బాధ శాశ్వతంగా వదిలిపోతుందన్న ఆశతో వాడు తండ్రిననుసరించడానికి అంగీకరించాడు.

ముగ్గురూ కలిసి మోతుబరి రామయ్య ఇంటికి వెళ్ళారు. రామయ్య తన అనుభవాన్ని వాళ్ళకి చెప్పాడు.

రామయ్య మెత్తగా ఉంటూ వీలైనంతలో అందరికీ సాయపడుతూండేవాడు. అలా పది సంవత్సరాలు గడిచేసరికి ఆయనకు కాస్త మంచిపేరు వచ్చింది. కానీ ఒకరోజున ఆయనకు చాకలి మీద కోపం వచ్చింది. వాడు

వేసిన బట్టలన్నీ తేలేదు. అదేమని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. కాసేపు నిగ్రహించుకున్నా వాడి ప్రవర్తన ఎంతకీ మారక పోవడంతో ఆయన చెయ్యెత్తి వాణ్ణి కొట్టబోయాడు. అంతే ఆయనకు చెడ్డపేరు వచ్చేసింది" ఊళ్ళోని శ్రమ జీవులందరూ ఆయన్ను దుర్మార్గుడనడం మొదలుపెట్టారు.


"నేను కోపగించుకోకుండా నెమ్మదిగా మాట్లాడి ఉంటే చాకలి బుద్ధిగా ఉండేవాడేమో! నేనేమో మోతుబరిని, వాడు బట్టలుతికేవాడన్న భావం నాలో ఉండిపోయింది. అందుకే ఆ రోజలా ప్రవర్తించాను. ఆ చెడ్డ పేరును పోగొట్టుకునేందుకు మరిన్ని సంవత్సరాలు శ్రమించవలసి వచ్చింది. అందుకే మంచివాడనిపించుకుందుకు సంవత్సరాలు పట్టవచ్చు కానీ చెడ్డవాడనిపించుకునేందుకు క్షణం కూడా పట్టదు" అన్నాడు రామయ్య.

తర్వాత గోపాలయ్య అలాంటివాళ్ళు మరో ముగ్గురి దగ్గరకు తీసుకుని వెళ్ళాడు. అందరూ రామయ్య చెప్పిన లాంటి కథలే చెప్పారు.

"ఇప్పుడేమంటారు?" అన్నాడు గోపాలయ్య.

"ఇంకా నీ మాటలు ఋజువు కాలేదు. నువ్వు మంచిపనులు చేస్తూ, మంచివాళ్ళమనిపించుకునేందుకు తాపత్రయ పడుతున్న వాళ్ళ దగ్గరకు మమ్మల్ని తీసుకుని వెళ్ళావు. నేను మరో తరహా మనుషుల్ని కూడా చూడాలనుకుంటున్నాను. ఈ ఊళ్ళో జులాయి వెధవగా పేరు బడ్డ ఒక మనిషి పేరు చెప్పు" అన్నాడు ఆనందుడు.





"ఎవడో ఎందుకూ - మావాడే ఉన్నాడు. కానీ వీడు మన కూడా ఏడిశాడు కాబట్టి ఇంకోడి పేరు చెబుతాను. వాడి పేరు చంద్రయ్య!" అన్నాడు గోపాలయ్య.

అప్పుడానందుడు మళ్ళీ రామయ్య ఇంటికి దారితీసి - అక్కడ రామయ్యను చంద్రయ్య గురించి అభిప్రాయం చెప్పమన్నాడు.

"వాడాండీ వాడుట్టి దగుల్బాజీ. వాడి ముఖం చూస్తేనే పంచమహాపాతకాలూనూ" అన్నాడు రామయ్య.

"ఈ అభిప్రాయం మీదా - ఊరందరిదీనా?" అనడిగాడు ఆనందుడు.

"ఇది ఊరందరి అభిప్రాయమూనూ! కావాలంటే మీరే అడిగి తెలుసుకోండి!" అన్నాడు రామయ్య.

"అది సరే - ఊరంతా తన గురించి ఇలా అనుకుంటున్నారని వాడికి తెలుసా?" అన్నాడు ఆనందుడు.

"తెలియకపోవడానికి ఎవరైనా చాటుగా అంటేగా - అందరూ వాణ్ణి మొహం మీదే తిడతారు" అన్నాడు రామయ్య.

అప్పుడు ఆనందుడు మిగతా ఇద్దర్నీ వెంట బెట్టుకుని - ఇందాకా వెళ్ళిన ఇతర వ్యక్తుల వద్దకు మళ్ళీ వెళ్లి చంద్రయ్య గురించి అడిగాడు. వాళ్ళ అభిప్రాయాలు రామయ్య వాటితో సరిపోయాయి.

"ఇప్పుడు మనం చంద్రయ్య వద్దకు వెడదాం!" అన్నాడు ఆనందుడు.

ముగ్గురూ చంద్రయ్య ఇంటికి వెళ్ళారు. ఆ సమయంలో చంద్రయ్య తన దొడ్డి గోడ ఎక్కి పొరుగింటి జామచెట్టు కాయలు కోస్తున్నాడు. తన కోసం వచ్చిన వారిని చూస్తూనే వాడు గోడదూకి, "నాతో మీకేం పని?" అని చిరాగ్గా అడిగాడు.

ఆనందుడు చంద్రయ్యతో, "ఊరందరూ నిన్ను నానా మాటలూ అని ఆడిపోసుకుంటున్నారు. నీకావిషయం తెలుసా?" అన్నాడు.

"ఏ దరిద్రుడో పిచ్చివాగుడు వాగితే నేనెందుకు లెక్కచేయాలి? అలాంటివి నేను పట్టించుకోను" అన్నాడు చంద్రయ్య.

"అది పిచ్చివాగుడెందుకవుతుంది? ఉదాహరణకిప్పుడు నువ్వు పొరుగింటి జామకాయలు కోస్తున్నావు.

అందుకు పొరుగింటాయన నిన్ను తిడితే న్యాయమే కదా!" అన్నాడు ఆనందుడు.

"నాకు నచ్చిన పని నేను చేశా. వాడి జామకాయతో నా కడుపు నిండేక వాడెన్ని అంటే మాత్రం నాకెందుకు! అది పిచ్చి వాగుడుకిందే జమకట్టి ఊరుకుంటాను. పెరట్లో జామకాయలు కోసినందుకు న్యాయస్థానానికెవరూ వెళ్ళరు కదా! కాబట్టి ఇది అన్యాయమనీ నాకు అనిపించదు" అన్నాడు చంద్రయ్య.


గోవిందయ్య వాడివంక ఆరాధనా పూర్వకంగా చూశాడు.

ముగ్గురూ అక్కణ్ణించి బయటపడ్డాక దారిలో వారికో ముష్టి వాడెదురై బిచ్చమడిగాడు. ఆనందుడు, వాడితో "దున్నపోతులాగున్నావు. కాళ్ళూ చేతులూ సక్రమంగా ఉన్నాయి. ఇలా అందర్నీ అడుక్కుని రోజులు గడపకపోతే నాలుగిళ్ళలో వళ్ళు వంచి పనిచేసుకోవచ్చుగా సోమరి పీనుగు కానా!" అని తిట్టాడు.

ముష్టివాడి కళ్ళెర్రబడ్డాయి, "అయ్యా! నా మానాన నేను అడుక్కుతింటున్నాను తప్ప తుంటరి పనులేం చేయడం లేదు. ఇష్టమైతే బిచ్చం వేయండి. లేదా ఊరుకోండి. అంతేకానీ నేను మాట పడను" అన్నాడు.

ఆనందుడు ముష్టివాడికి క్షమార్పణలు చెప్పుకుని పంపేశాడు. తర్వాత గోపాలయ్యతో, "నేను చెప్పిన మాటలు ఋజువు చేశాను. నువ్వోడిపోయానని ఒప్పుకుంటావా?" అన్నాడు.

గోపాలయ్య ఏదో అనబోతుండగా గోవిందయ్య ఆనందుడి కాళ్ళమీద పడి, "నాకు బుద్ధి వచ్చింది. చెడ్డపనులు చెయ్యను" అన్నాడు.



కరాళుడింతవరకే కథను చెప్పి, "ఓ సవిత్ప్రక మహారాజా! ఆనందుడు చెడ్డవాడే గొప్పవాడని ఎలా ఋజువుచేశాడో నాకర్థం కాలేదు. ఒకవేళ చెడ్డవాడే గొప్పవాడని ఆయన ఋజువు చేసి ఉంటే గోవిందయ్య అందుకు సంతోషించాల్సింది పోయి చెడ్డ పనులు మానేస్తానని అన్నాడు. ఇదంతా నాకు గజిబిజిగా ఉంది. తెలిసి కూడా నా సందేహాలకు సమాధానమివ్వకపోయావో ఈ క్షణం నుంచీ నీవు నాకు బానిసవు" అన్నాడు.

దీనికి సవిత్ప్రకుడిలా బదులిచ్చాడు.

"అడుక్కుతినే వాడికి కూడా మానాభిమానా లున్నాయి. వాడు మాటపడడు సరికదా - తను చెడ్డపనులు చేయడం లేదని గర్వంగా చెప్పుకున్నాడు. అంటే చెడ్డవాడు బిచ్చగాడి కంటే అధముడని తేలిపోయింది కదా! అదలాగుంచితే ఎంతో కష్టపడి సాధించుకున్న మంచి పేరు కూడా ఒక్క చెడ్డ పనితో పోతుంది. అయినా చెడ్డవాడు చెడ్డపని చేస్తాడు. చెడ్డవాళ్ళను ఊరంతా మొహం మీదే దుమ్మెత్తి పోస్తారు. ఒక్క మాటను కూడా సహించ లేని మంచివాడి కంటె - ఎన్ని నీచపు తిట్లు తిట్టినా సహించగల చెడ్డవాడి ఓర్పు చాలా గొప్పది. మనిషికి మానాభిమానాలు విడిచిపెట్టడం ఎంతో కష్టం. చెడ్డవాడది సులభంగా విడిచి పెట్టేయగల్గుతున్నాడు. ఈ విధంగా మంచివాడి కంటే చెడ్డవాడే గొప్పవాడని ఋజువు చేశాడు ఆనందుడు. చెడ్డవాడి గొప్పతనం స్వరూపం తెలిసేక ఇంగితమున్నవాడెవడూ అలాంటి గొప్పత నాన్ని కోరుకోడు. అందుకే గోవిందయ్యలో మార్పు వచ్చింది. ఈ విషయం తెలిస్తే బహుశా చంద్రయ్య లోనూ మార్పు వచ్చి ఉండేది."

అది సరియైన సమాధానం కావడంతో సవిత్ప్రకుడికెదురుగా ఉన్న కన్యపై కరాళుడి ప్రభావం నశించి ఆ యువతి సింహంగా మారి గర్జిస్తూ అడవిలోనికి పరుగుతీసింది.

— వసుంధర





పంచరంగుల పంజరం

లక్ష్మీనాథుడు ధనవంతుడు. సుధామయి అతడి భార్య. వారికి అఖిలుడొక్కడే సంతానం. ఒకరోజు ఒక జ్యోతిష్కుడు అఖిలుడి జాతకాన్ని పరిశీలించి, వాడికి ఎనిమిదో ఏట ఒక మాంత్రికుడికి బందీ అయ్యే ప్రమాదముందని హెచ్చరించాడు. అఖిలుడికి ఎనిమిదో ఏడు రావడానికి అప్పటికి ఇక మూడు నెలలు మాత్రమే సమయముంది. లక్ష్మీనాథుడు తన కొడుక్కి రానున్న ప్రమాదాన్ని ఎలాగైనా సరే అరికట్టాలనుకున్నాడు. తమ భవనం చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ నిర్మించాడు ద్వారం వద్ద అపరిచిత వ్యక్తులు లోపలికి రాకుండా గట్టి కాపలా ఏర్పాటు చేశాడు. ఒక గురువు ప్రతిరోజూ వచ్చి వాడికి చదువు చెప్పి వెళ్ళేవాడు. ఆయన వాడికి ఆసక్తికరంగా ఉండే మంచి మంచి కథలు చెప్పేవాడు. ఆ కథల్లో పక్షులు, జంతువులు మనష్య భాషలో మాట్లాడినట్లు అద్భుతమైన కల్పన ఉండేది. ఆ కల్పన అఖిలుణ్ణి బాగా ఆకట్టుకుంది. అలాంటి పక్షులూ, జంతువులతో తాను కూడా మాట్లాడాలన్న కోరిక వాడిలో కలిగింది.

అఖిలుడికి శివుడనే స్నేహితున్నాడు. వాడు అప్పుడప్పుడూ ఆడుకోవడానికి వచ్చేవాడు. శివుడికి తెలివితేటలున్నాయి. కానీ అప్పుడప్పుడూ అతి తెలివి ప్రదర్శిస్తుంటాడు. అన్నీ తెలిసినట్లు డాంబికం కూడా ఉంది. ఒకరోజు వారిరువురూ ఎన్నో కథలు చెప్పుకుంటూంటారు. ఒక రోజున అఖిలుడు, "శివా! మాట్లాడే జంతువులు, పక్షులు ఎక్కడ ఉంటాయి?" అని అడిగాడు.

"నువ్వింకా వాటిని చూడలేదా? నేనెప్పుడో చూశాను. మాట్లాడాను కూడా" అని డాంబికాలు పలికి అఖిలుణ్ణి మేడ మీదికి తీసుకెళ్ళి దూరంగా ఉన్న కొండల్ని చూపించి, "ఆ కొండల వెనుక పెద్ద అడవి ఉంది. ఆ అడవిలో మాట్లాడే పక్షులూ, జంతువులూ ఉన్నాయి" అన్నాడు.

— గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు



అఖిలుడికి తనూ అక్కడికి వెళ్ళాలన్న కోరిక కలిగింది. అయితే తను బయటికి వెళ్ళడానికి వీల్లేదన్న విషయం గుర్తుకువచ్చి బాధగా, "ఆ జ్యోతిష్కుడు చెప్పింది నిజమౌతుందో లేదో తెలియదు. కానీ ఆ మాంత్రికుడితో పోటీపడి వాడి కన్నా ముందుగా నా తల్లిదండ్రులే నన్ను బంధించారు. ఈ చెరసాల జీవితం కన్నా చావే నయమనిపిస్తుంది. నేను ఇచ్చటి నుంచి బయటపడే ఉపాయం నువ్వే ఆలోచించాలి" అన్నాడు శివుడితో. వాడు ఒక్క క్షణం ఆలోచించి ఉత్సాహంగా చిటికె వేస్తూ ఒక ఉపాయం చెప్పాడు. ఆ ప్రకారం వారిరువురూ దుస్తులు మార్చుకున్నారు. దగ్గరగా చూస్తే తప్ప ఎవరో పోల్చుకో లేని విధంగా వేషాలు మార్చుకున్నారు. అఖిలుడు శివుడి వేషంతో కాపలా వాళ్ళను మోసం చేసి బయట పడ్డాడు. శివుడు అఖిలుడి వేషంలో ఆ భవనంలో చిక్కుకుపోయాడు. తాము చేసిన అతి తెలివి పనుల వల్ల ఇరువురూ కష్టాల పాలౌతామని ఆ క్షణంలో ఇద్దరూ ఆలోచించలేదు. సరిగ్గా ఆరోజే అఖిలుడికి ఎనిమిదో ఏడు వచ్చింది.

అఖిలుడు దూరంగా ఉన్న కొండలు దాటి వెళ్ళాడు. అక్కడ శివుడు చెప్పినట్లు పెద్ద అడవి లేదు. ఉన్న చిన్న అడవిలో మాట్లాడే జంతువుల మాటటుంచి మామూలు జంతువులు కూడా లేవు. తిరిగి తిరిగి అలసిపోయి ఒక చెట్టు క్రింద కూర్చున్న అఖిలుడి దగ్గరకు నాగదండుడనే మాంత్రికుడు వచ్చాడు. వాడు పొడవాటి పీచు గెడ్డం, పెద్ద కనుబొమలు, రొయ్య మీసాలు, నుదుటిన విభూది రేఖలు, మెడలో గచ్చకాయల మాల, పొడవాటి నల్లని దుస్తులు, ఒక చేతిలో సర్పంలా మెలికలు తిరిగిన దండం, మరో చేతిలో చిన్న కొయ్యపెట్టె వగైరాలతో చూడ్డానికి విచిత్రాకారంలో ఉన్నాడు.

నాగదండుడు అఖిలుడి చెంతకు వచ్చి "అబ్బాయీ, ఏమిటి వెతుకుతున్నావు? ఈ అడవికి ఒంటరిగా ఎందుకు వచ్చావు? నిన్ను చూస్తుంటే ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చి నట్లున్నావు. అవునా?" అని అడిగాడు.

అఖిలుడు వాడికి తన కథంతా చెప్పి, "నిన్ను చూస్తూంటే మామయ్యా అని పిలవాలనిపిస్తోంది. మామయ్యా! నాకు మాట్లాడే పక్షులు, జంతువులు

ఎక్కడుంటాయో చూపిస్తావా?" అన్నాడు.

"అవి వేరే ఎక్కడో లేవు" అంటూ తన వద్దనున్న కొయ్య పెట్టె చూపించి, "ఈ పెట్టెలోనే ఉన్నాయి. ఇందులో మాట్లాడే పక్షులు, జంతువులే కాదు. పంచరంగుల స్వర్గం కూడా ఉంది. నీలాంటి బాలల కోసం నా మంత్రశక్తులన్నీ ఉపయోగించి నేనే ఆ స్వర్గాన్ని సృష్టించాను. నువ్వూ చూస్తావా?" అన్నాడు నాగదండుడు. మాట్లాడే పక్షులు, జంతువులు అనేప్పటికి అఖిలుడిలో ఉత్సాహం వేసింది, "చూస్తాను మామయ్యా!" అన్నాడు.

నాగదండుడు తన వద్దనున్న కొయ్య పెట్టె క్రింద ఉంచి మొలలో దాచుకున్న తాళం చెవిని పెట్టెకున్న రంధ్రంలో ఉంచి తిప్పి, మంత్ర దండంతో కొయ్య పెట్టె మీద మూడుసార్లు తాటించాడు. అప్పుడు కొయ్య పెట్టె క్రమేపీ పెరిగి పెద్దదయింది. పెట్టెకున్న రంధ్రం కూడా పెరిగి పెద్దదై మనుష్యులు వెళ్ళగలిగే ద్వారంగా మారింది. నాగదండుడు, అఖిలుడు లోనికి వెళ్ళారు. లోపల అఖిలుడికి కనుపించిన దృశ్యాలు అంతులేని ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగించాయి. అక్కడ నిజంగా మరో స్వర్గమే ఉంది. ఎక్కడ చూచినా రకరకాల ఫల వృక్షాలు. పొదల్నీ లతల్నీ ఆక్రమించిన రంగు రంగుల పుష్పాలు. వాటి పరిమళాలు, పుష్పాలు మకరందాన్ని గ్రోలటానికి పోటీపడుతూ ఎగురుతున్న తుమ్మెదలు, సీతాకోక చిలుకలు కిలకిలా రావాలలో మధురంగా పలికే ఎన్నో రకాల పక్షుల గుంపులు గునగున నడుస్తున్న



పాల నురుగు లాంటి తెల్లని కుందేళ్ళు, పురి విప్పి నాట్యమాడే నెమళ్ళు, చెంగున దూకే లేడికూనలు మరెన్నో రకాల జంతువులు, జలపాతాలు, ఆకాశంలో ఏడు రంగుల ఇంద్ర ధనుస్సు.. వగైరాలతో అక్కడ ఎంతో మనోహరంగా ఉంది.

అక్కడ ఎంతో మంది బాలలున్నారు. అందరూ పక్షులు, జంతువులతో ఆడుకుంటున్నారు, వాటితో మాట్లాడుతున్నారు. అఖిలుడు కూడా వాళ్ళతో కలిసి పోయాడు. ఇంతలో ఉన్నట్లుండి సింహగర్జన వినిపించగా అఖిలుడు భయంతో వణికిపోయాడు. చూస్తే సింహం వాడి ప్రక్కనే ఉంది. సింహం అఖిలుడితో, "భయపడకు. నేను మీ లోకంలోని సింహం లాగా క్రూరమైన



అంటే మనిషి బొందెతోనే స్వర్గానికి వచ్చినట్లు. మీ ఇంటికి వెడితే నీకు కష్టాలు తప్పవు" అని బుజ్జగించాడు నాగదండుడు అఖిలుణ్ణి.

అఖిలుడు అందుకు ఒప్పుకోక, "నేను వెళ్ళకపోతే శివుడికి చెప్పలేనన్ని కష్టాలు. నేను లేకపోతే నా తల్లిదండ్రులు బెంగ పెట్టుకుంటారు నేను వెళ్ళక తప్పదు, మామయ్యా!" అన్నాడు.

ఎవరు ఏమయిపోతే నాకేం? నాకు కావలసింది నీలాంటి బాలల సుఖ సంతోషాలే! నీకు ఇక్కడ ఎంతో సంతోషంగా ఉంటుంది. నువ్వు ఇక్కడ ఉండిపోక తప్పదు. నేను వద్దంటే ఇక్కడి నుంచి నువ్వు వెళ్ళలేవు. నువ్వేకాదు ఇక్కడికి వచ్చిన వాళ్ళు ఎవ్వరూ తిరిగి వెళ్ళలేరు. తాళం చెవి ఉన్నవారు మాత్రమే ఇచ్చటి నుంచి వెళ్ళగలరు. అది నా వద్ద ఉంది కాబట్టి నేను మాత్రమే వెళ్ళగలను. వస్తా" అంటూ వెళ్ళిపోయాడు నాగదండుడు. వాడు వెళ్ళిపోగానే ద్వారం మూసుకునిపోయింది. అఖిలుడు అచ్చట చిక్కుకు పోయాడు. అంతేకాదు, ద్వారం మూత పడగానే వాడు స్మృతులన్నీ మరచిపోయి అక్కడున్న బాలలతో కలిసిపోయాడు. నాగదండుడి సృష్టి బాహ్యంలో చిన్న కొయ్య పెట్టెగా మారిపోయింది.

నాగదండుడు పూర్వాశ్రమంలో ఔదంబరుడనే ధనవంతుడు. వాడికి చిన్న పిల్లలంటే మహా ఇష్టం. దురదృష్టం కొద్దీ వాడికి సంతానం లేదు. అందుకని చుట్టుప్రక్కల ఇండ్లలోని పిల్లల్నందర్నీ ఇంటికి పిలిచేవాడు. వాడు కోరినన్ని తినుబండారాలూ, ఆట వస్తువులూ కొనియిచ్చేవాడు వారందర్నీ

దాన్ని కాదు. అసలిక్కడ క్రూరత్వమన్నదే లేదు. నీవు నాతో ఎంచక్కా ఆడుకోవచ్చు" అంది. అఖిలుడికి భయం పోయింది. వాడు చాలాసేపు దానితో ఆడుకున్నాడు. కాసేపటికి అఖిలుడికి ఇల్లు గుర్తుకు వచ్చింది. ఆ వెంటనే తల్లిదండ్రులూ, తన కోసం తన భవనంలో బందీ అయిపోయిన శివుడూ గుర్తుకు వచ్చారు. వాడు నాగదండుడి వద్దకు వెళ్ళి "మామయ్యా! నా కోసం నా తల్లిదండ్రులు ఆందోళన పడుతుంటారు. నా వేషంలో శివుడు అక్కడ చిక్కుకుపోయాడు. ఇక నేను ఇంటికి వెళతాను. దారిచూపించు" అన్నాడు.

"నువ్వు ఇక్కడి నుంచి వెళ్ళవద్దు. నా మాట విను. ఇక్కడికి రావడం నీలాంటి అదృష్టవంతులకు మాత్రమే సాధ్యమౌతుంది. ఇక్కడికి రావడం

ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు. దాంతో పిల్లలంతా చదువులు మానేశారు. చివరికి తమ స్వంత ఇళ్ళకు కూడా వెళ్ళడం మానేసి ఔదంబరుణ్ణే అంటిపెట్టుకొని ఉండేవారు. ఔదంబరుడు తమ పిల్లలకి మిత్రుడు కాదు, శత్రువని త్వరలోనే గ్రహించిన వారంతా ఆగ్రహించి తమ పిల్లల్ని వాడి చెంతకు వెళ్ళనివ్వకుండా కట్టడి చేశారు. తన వద్దకు ఎవరూ పిల్లలు రాకపోవడంతో ఔదంబరుడు పిచ్చివాడై పోయాడు. ఒక రాత్రి కొంతమంది పిల్లల్ని రహస్యంగా పిలిచి వారిని తన వెంట తీసుకొని మానవమాత్రుడు రాలేని ఒక పర్వత ప్రాంతానికి తీసుకుని పోయాడు. అక్కడ సరైన సదుపాయాలు లేక పిల్లలంతా మరణించారు. వారి మరణం ఔదంబరుణ్ణి కృంగ దీసింది. తన వద్దకు వచ్చే పిల్లలకు ఆకలి దప్పులు లేకుండా చేయాలంటే తనకు మంత్రశక్తులు అత్యంత ఆవశ్యకమని గుర్తించి శూలదండుడనే మాంత్రికుడి వద్ద శిష్యుడిగా చేరి మంత్ర విద్యలు నేర్చుకొని నాగదండుడిగా పేరు మార్చుకున్నాడు. మరికొంత సాధనతో మరికొన్ని శక్తుల్ని వశపరచుకొని బాలల కోసం ఇలలో ఒక స్వర్గాన్ని సృష్టించాడు. అంతపెద్ద సృష్టినీ చిన్న కొయ్యపెట్టెలో నిక్షిప్తం చేయగలిగాడు. మంచి మాటలతో ఆకట్టుకొని ఎంతోమంది పిల్లల్ని ఆ పంచరంగుల పంజరంలో బంధించాడు. నిజానికి నాగదండుడు చెడ్డవాడు కాదు. మంచివాడే! కానీ వాడి ప్రేమ ఎంతోమంది తల్లిదండ్రులికి శాపమైంది. ఎంతోమంది తమ పిల్లల్ని పోగొట్టు



కొని దుఃఖ సాగరంలో మునిగి యున్నారు.


అఖిలుడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో శివుడి బండారం సులభంగా బయట పడిపోయింది. అయితే వాడు ఎన్ని విధాలుగా దండించినా అఖిలుడు ఎక్కడికి వెళ్ళాడో చెప్పకుండా, "అఖిలుడు కనిపించకుండా పోవడానికి కారణం నేనే. నా తెలివి తేటలు ఉపయోగించి అఖిలుణ్ణి తిరిగి తీసుకుని వస్తాను. నాకు అనుమతినివ్వండి" అన్నాడు. చివరకు ఒక అవకాశం ఇచ్చి చూద్దామని వాడికి స్వేచ్ఛనిచ్చాడు లక్ష్మీ నాథుడు.


తిన్నగా కొండల వెనుకనున్న చిట్టడవి లోకి వెళ్ళాడు. అక్కడ వాడికి నాగదండుడు పరిచయ

మయ్యాడు. అఖిలుణ్ణి బంధించిన మాంత్రికుడు వాడే అయివుంటాడని గ్రహించిన శివుడు వాడితో చాలా జాగ్రత్తగా వ్యవహరించ సాగాడు.

నాగదండుడు శివుణ్ణి కూడా బాలల స్వర్గం లోకి తీసుకెళ్ళాడు. శివుడు నాగదండుడు తాళం చెవిని భద్రంగా దాచుకోవడం పసికట్టి ఆ తాళం చెవిలో ఏదో విశేషం ఉండే ఉంటుందనుకుని హస్తలాఘవంతో దానిని తస్కరించి తనవద్ద దాచుకున్నాడు. అక్కడి విశేషాలు చూస్తున్నట్లు నటిస్తూ మాంత్రికుడికి దూరంగా వెళ్ళి అఖిలుడి కోసం వెతికాడు. వాడి ప్రయత్నం ఫలించి తొందరగానే అఖిలుడు కనపడ్డాడు. అఖిలుడు మాత్రం గత స్మృతులు మరచిపోయినందువల్ల శివుణ్ణి గుర్తించ లేకపోయాడు. అయినా శివుడు కలత చెందలేదు. ఎలాగైనా అఖిలుడితో పాటు అక్కడి బాలలందర్నీ ఆ పంచ రంగుల పంజరం నుంచి తప్పించాలనుకున్నాడు. కొండ చిలువ పాకుతోందంటూ అక్కడున్న పిల్లలందరికీ చెప్పి వారందరినీ ఒకరి వెనుక ఒకరిని నిలబెట్టి తను వెనుకనుండి తోస్తూ వాళ్ళూ ఒకరినొకరు ముందుకు తోసుకునేలా చేసి ద్వారం దాటేశాడు. వారంతా బయటికి రాగానే ద్వారం మూసుకుని పోయింది. నాగదండుడు అందులో చిక్కుకుని పోయాడు. పిల్లలందరికీ గతస్మృతులు గుర్తుకు వచ్చి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. వారి వారి తల్లిదండ్రులు ఎంతో సంతోషించి శివుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. అఖిలుడి తండ్రి లక్ష్మీనాథుడు తమ కుమారుడికి మాంత్రికుడి గండం తప్పించినందుకు అభినందించి శివుడికి చక్కని బహుమతి ఇచ్చాడు.

తమ కుమారుడికి స్వేచ్ఛ లేకుండా చేసినందువల్లే వాడు మాంత్రికుడి వలలో చిక్కుకుపోయాడని లక్ష్మీనాథుడు, సుధామయి గుర్తించారు. ఆ తర్వాత మరెన్నడూ వాడి స్వేచ్ఛకు అడ్డురాలేదు వారు.





పాప భారం

ఒకానొకప్పుడు గంధర్వ లోకంలో దేవనందిని అనే అమ్మాయి ఉండేది. ఆమె భూలోక సౌందర్యం గురించి గొప్పగా విని అందులోని నిజానిజాలు స్వయంగా తెలుసుకోవాలని భూలోకానికి దిగి వచ్చింది.

అదృశ్య రూపంలో సంచరిస్తూ ఆమె కోసల రాజ్యంలోని ఒక ప్రాచీనాలయాన్ని చూసింది. భూలోక శిల్పులు ఎంతటి ప్రవీణులో అని ఆమె ఆశ్చర్యపడుతున్న సమయంలో ఆమె ఓ యువకుణ్ణి చూసింది.

ఆ యువకుడు - ఏవిధమైన అంగవైకల్యమూ లేక ఎంతో ధృఢంగా ఉన్నాడు. అయితే వాడు ఆలయంలోకి వచ్చే భక్తుల ముందు చేయిసాచి యాచన చేసుకునేందుకు ఏమాత్రమూ సిగ్గు పడడం లేదు. ఆ యువకుడి మీద దేవనందినికి ఏహ్యాభావం కలిగి అంతగా జన సంచారం లేని చోటకు వెళ్ళింది.

అక్కడ భైరవుడనే గజదొంగ మాటువేసి ఉన్నాడు. అటుగా వచ్చిన భక్తుడొకణ్ణి ఆపి కత్తితో బెదిరించి అతడి చేతికున్న బంగారు కడియాన్ని దోచుకున్నాడు. ఆ దృశ్యం చూసిన దేవనందిని పరుల సొత్తు దోచుకునే దొంగకంటే మానాభిమానాలు విడిచిన యాచకుడే నయమనుకుంది.

అంతలో భైరవుడి కోసం కాపుగాచిన రక్షకభటులు అటుగా వచ్చి వాడిని పట్టుకున్నారు. అప్పుడు భైరవుడు, "నన్ను రాజుకు పట్టివ్వడం వల్ల మీకేమి ఒరుగుతుంది? నన్ను విడిచిపెడితే మీకు కొంత డబ్బిస్తాను" అన్నాడు.

అదృశ్యరూపాన ఉన్న దేవనందిని రక్షకభటులేం చేస్తారోనని ఆసక్తిగా తిలకించసాగింది. రక్షకభటులు తమలోతాము గుసగుసలాడుకున్నారు. తర్వాత భైరవుడిచ్చిన డబ్బు తీసుకుని వాడిని యథేచ్ఛగా విడిచిపెట్టేశారు.

అది చూసిన దేవనందినికి - జీవన భృతికి తప్పుదారి నెంచుకున్న యాచకుడు, దొంగల కంటె - అవినీతిని అణచడానికి జీవనభృతి

ఎన్. శివనాగేశ్వరరావు

తీసుకుంటూ అవినీతికి అవినీతితో సాయపడే రక్షకభటులింకా పరమ నీచులనిపించారు. భూలోకంలో ప్రకృతికున్న సౌందర్యం మానవులకు లేనందుకు నొచ్చుకుంటూ ఆమె గంధర్వ లోకానికి తిరుగు ప్రయాణమైంది.

దారిలో ఆమెకు శాంతివనం ఎదురైంది. అందులో తపమాచరిస్తున్న ధర్మధీరుడు అనే ఋషి ఆమెకు కనిపించాడు.

దేవనందిని ఋషిని సమీపించింది. ఋషి కన్నులు తెరవగానే, "మహర్షీ! ఒక సందేహం నన్ను వేధిస్తూంటే ఆగలేక మీ వద్దకు వచ్చాను. నేను మీ లోకంలో కష్టపడి పనిచేయగలిగీ - యాచనతో పొట్ట పోసుకుంటున్న ఒక సోమరినీ, అన్యాయంగా పరుల సొమ్ము దోచుకుంటున్న ఒక దొంగనూ, దొంగను పట్టి కూడా దొంగ సొమ్ముకోసం వాడిని విడిచిపెట్టిన అధర్మపరులైన రక్షకభటుల్నీ చూశాను. వారందరూ పాపులే కదా - ఈ పాప భారాన్ని భూదేవి ఎలా భరించగల్గుతున్నది?" అనడిగింది.

అందుకు ధర్మధీరుడు చిరునవ్వు నవ్వి దేవనందినికి - అక్కడికి కాస్త దూరంగా అడవిలో కట్టెలు కొట్టుకుంటున్న ఓ మనిషిని చూపి, "అతడి దినచర్యను పరిశీలించు. నీ అనుమానం తీరుతుంది" అన్నాడు.

కట్టెలు కొట్టేవాడు పగలంతా అడవిలో శ్రమించాడు. కొట్టిన కట్టెల్ని మోపుగా కట్టి ఊళ్ళోకి తీసుకునిపోయి అమ్మాడు. వచ్చిన డబ్బులతో రొట్టెలు కొన్నాడు. తనకోసం, భార్య కోసం ఒక రొట్టె - పిల్లల కోసం ఒక రొట్టె ఉంచి మిగిలిన రొట్టెలను - ఏ ఆధారమూ లేక ఒక చెట్టుకింద నివాసముంటున్న వృద్ధులకు పంచిపెట్టాడు.


దేవనందిని ఇదంతా చూసి ఎంతో సంతోషించి, "ఇంతటి పుణ్యాత్ముణ్ణి మోస్తున్న సంతోషంలో భూదేవి ఎంతటి పాప భారాన్నైనా మరిచిపోగలదు" అనుకుని అక్కణ్ణించి ఆకాశ మార్గాన్ననుసరించి గంధర్వలోకానికి తృప్తిగా తిరిగి వెళ్ళింది.



బొమ్మరిల్లు ముచ్చట్లు

లోప మెరుగని దేశం:

మోటారు వాహనాలకు స్పేరు 'పార్ట్సు తయారుచేసినప్పుడు మనదేశంలో - పది లక్షలకూ పదిహేను నుంచి ఇరవై వేల దాకా లోపభూయిష్ఠమైనవి వస్తాయి. విదేశాల్లో అంటే ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో అయితే అలాంటివి పది లక్షలకూ అయిదో పదో మాత్రమే ఉంటాయి. అంటే వేలుకాదు అచ్చంగా అయిదో, పదో అంతే! ఒక అమెరికన్ కంపెనీ మోటారు వాహనాల స్పేర్సు కోసం జపాన్ దేశానికి ఆర్డరిస్తూ - పది లక్షల్లో పనికిరానివి పదికంటే ఉండకూడదని షరతు పెట్టింది. జపాను దేశంలో కోట్లకొద్దీ స్పేర్సు తయారుచేసినా ఒక్కటీ పనికి రానిది ఉండదు. లోప మెరుగని దేశమది. అందుకని



ఆ అమెరికన్ కంపెనీ ఆర్డరు వారికి అర్థం కాలేదు. కాబట్టి ఏం చేశారంటే - పది లక్షలు స్పేర్సు తయారుచేసి అదనంగా పది పనికిరాని స్పేర్సును ప్రత్యేకంగా తయారుచేసి పంపారుట.

జ్ఞానయోగి:

ఆలివర్ హెవీసైడ్ 1825లో పుట్టాడు - బ్రిటన్లో. కొంతకాలం స్కూల్లో చదువుకున్నా



కాలేజి చదువు లెరుగడు. ఆయనకు భౌతిక శాస్త్రమంటే అభిలాష. తనకుతానుగా ఆ శాస్త్రాన్నభ్యసించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విజ్ఞాన శాస్త్రజ్ఞుడయ్యాడు. ఆయనకెంత పేరు వచ్చినా యోగిలా ఏకాంత జీవితాన్నే గడిపాడు. ఒకసారి ఆయన ఏవో ప్రయోగాలు చేస్తూంటే గ్యాసు మండి ముఖం కాలింది.

"వసుంధర"

అది తెలిసి కొందరాయన్ను పరామర్శించడానికి వెళ్ళారు. అప్పటికాయన ముఖం చుట్టూ తువ్వాలు కప్పుకుని అది జారిపడకుండా మెడ చుట్టూ తాడుతో కట్టుకుని ఉన్నాడట. చూడవచ్చిన వారికాయన తువ్వాలు మధ్య లోంచీ కంతచేసి ఓ కన్నుతో చూసి మాట్లాడేట్ట. ఆయన ఎటువంటి పేదరికంలో జీవించాడంటే వయసు డెబ్బైదాటేక - గ్యాసు బిల్లు కట్ట లేదని కంపెనీ ఆయనింటికి గ్యాసు సరఫరా ఆపివేస్తే 15 నెలల పాటు దీపాలు, వెచ్చదనం లేకుండా ఉన్నాడు.

హీరో:


సినిమాల్లో అద్భుతాలు సాధిస్తూంటారు. అది మన భ్రమే అయినా మనకెంతో సంతోషం కలుగుతుంది. ప్రేక్షకులందరూ సంతోషపడడం వల్ల సినిమా హీరోలు కోటీశ్వరులవుతున్నారు. నిజ జీవితంలోనూ అలాంటి హీరోలుంటారు. వారివల్ల ఎవరు లాభం పొందాలో వారికే సంతోషం కలుగుతుంది. కొందరు ప్రేక్షకులున్నా చూసి వెళ్ళిపోతారు. తర్వాత ఆ హీరో గురించి మర్చిపోతారు. అలాంటి హీరో కథ ఇది. కలకత్తాలో జరిగింది. ఓ గొప్పింటి



మహిళ జోడు గుర్రాల బగ్గీ ఎక్కి నగర విహారం చేస్తోంది. ఎందుకో బండివాడు క్రిందకు దిగాడు. ఉన్నట్లుండి గుర్రాలు పరు గందుకున్నాయి. బండివాడికేం చేయాలో తోచలేదు. మీదకు వస్తున్న బండిని తప్పించుకుందుకు జనం అటూఇటూ పరుగు లెత్తారు. బండిలోని మహిళ భయంతో కేకలు పెట్టింది. ఆ తర్వాత ఏడుపు ప్రారంభించింది. అయినా ఎవరూ ఆమెను రక్షించడం సాధ్య మనుకోవడం లేదు. అలాంటి సమయంలో సందులోంచీ రోడ్డు మీదకు వచ్చిన నరేన్ ఆ దృశ్యం చూశాడు. క్షణం కూడా జాప్యం చేయలేదు. తనకు ప్రమాదముంటుందని శంకించలేదు. బండి వెనుకే పరుగెత్తాడు. దగ్గర కాగానే కదుల్తున్న బండిలోకి దూకి చేరాడు. బండివాడు కూర్చునే చోటకు వెళ్ళి కళ్ళేన్నందుకుని గుర్రాలను అదుపుచేశాడు. బండి ఆగింది. గొప్పింటి మహిళ నరేన్‌కి కృతజ్ఞతలు చెప్పుకుంది. తాత్కాలికంగా హీరో అయిన నరేన్ మళ్ళీ మామూలు మనిషై తన దారిన వెళ్ళాడు.

మత గురువుల భాష:

గురునానక్ ఒకసారి మరో మతానికి చెందిన పుణ్యస్థలానికి వెళ్ళాడు. అక్కడి మత గురువు ఆయనకు గ్లాసునిండా పాలిచ్చాడు. దాని అర్థం- "ఈ ప్రాంతంలో ఇప్పటికే చాలినందరు మత గురువులున్నారు. నీకిక చోటు లేదు" అని! నానక్ అది అర్థం చేసుకున్నాడు. ఆయన ఒక పుష్పాన్ని తీసుకుని



పాలపై ఉంచి మత గురువుకు తిరిగి ఇచ్చేశాడు. అక్కడ ఎందరు మత గురువులున్నా వారందరికీ పైన తనకు స్థానముంటుందని నానక్ అన్నట్లు అర్థం చేసుకున్న ఆ మత గురువు తన తొందరపాటుకు సిగ్గుపడ్డాడు.

దేవతల మేలు కొలుపు:

పెన్నీ హార్కుమ్ అనే 30 ఏళ్ళ అమెరికన్ మహిళ తొమ్మిదేళ్ళ హీతర్ హెర్కుమ్‌ను తీసుకుని నవంబరు 30న షాపింగుకు వెళ్ళింది. క్రిస్మస్ పండుగ కదా - బోలెడన్ని కొనుక్కొన్నారు. కార్లో తిరిగి వస్తూంటే చిన్న ప్రమాదం జరిగింది - ఎదురుగా వస్తున్న కార్లు గుద్దుకోవడం వల్ల ఆ కుదుపుకు హీతర్ తలకు దెబ్బ తగిలి ఆమెకు స్పృహ తప్పింది. ఒకటి కాదు, రెండు కాదు, 12 రోజులు కూతురలా దీర్ఘ నిద్రలో ఉండిపోయేసరికి పెన్నీకి బెంగపట్టుకుంది. అప్పుడామె హీతర్ కిష్టమైన, "మన మధ్య దేవతలున్నారు" (ఏంజెల్స్ ఎమాంగ్ అజ్) అన్న పాటని వినిపించింది. అంతే! నిద్రలోనే హీతర్ ఏడుపు మొదలుపెట్టింది. ఆ పాట విన్నప్పుడల్లా అలా చేయడం ఆ ఇంట్లో అలవాటు. అందుకని - నిద్రపోతున్నప్పటికీ - తన కూతురికి చుట్టూ ఏం జరుగుతున్నదో అవగతమవుతున్నదని తల్లికి తోచింది. వెంటనే కూతురి పక్కకు వెళ్ళి పడుకుని చెవిలో "అయ్ లవ్ యూ" - అని "నువ్వు కూడా నాతో అదే మాట చెప్పు" అంది. హీతర్ "ఐ లవ్ యూ" అంది. ఆ మాట గుసగుసలాడినట్లుగా ఉండి - మళ్ళీ



అనమంది పెన్నీ. హీతర్ మళ్ళీ అంది. "కష్టాల్లో ఉన్నప్పుడు మన మధ్యకు వచ్చి జీవించడమెలాగో నేర్పుతారు దేవతలు" అని చెప్పే ఆ పాటలోని అర్థం నిజమయింది.

దుస్సాహసం:

గేలీ లిన్ ఆడమ్స్ మరో ఇద్దరు మిత్రులతో కలిసి ఒక గుహలో ప్రవేశించాడు. బాగా లోపల ఒక జలపాతమున్నదనీ - దాని గురించి కొత్త విశేషాలు తెలుసుకోవాలనీ అతడి ఉద్దేశ్యం. వారి ఆధారం ఒక త్రాళ్ళనిచ్చెన. కొంత దూరం వెళ్ళాక ఆడమ్స్‌కు పట్టు తప్పి ఓ గోతిలో పడ్డాడు. ఆ గొయ్యి మనిషి పట్టేటంత పెద్దది. నాలుగంతస్థుల భవనాన్ని తనలో

ఇముడ్చుకోగలంత లోతైనది. ఆడమ్స్ తను చనిపోయాననే అనుకున్నాడు. ఈ క్రిస్మస్‌ను తన భార్య స్మశానంలో జరుపుకోగలదని నమ్మాడు. కానీ మిత్రులతణ్ణి వెలికి దీశారు. అతడిప్పుడు కోలుకుంటూ ఎంత తొందరగా ఇల్లు చేరతానా అని ఎదురుచూస్తున్నాడు. పర్వత గుహలలో ప్రవేశించడం సాహసం కాదు, దుస్సాహసమని అతడిప్పుడు పూర్తిగా నమ్ముతాడు.



పరాజయ ఢంకా:

1936 ఎన్నికల్లో అమెరికన్ ప్రెసిడెంటు పదవికి రూజ్‌వెల్ట్‌పై పోటీ చేసిన ఆల్ఫ్ లేండన్ మరీ చిత్తుగా ఓడిపోతే ఆయన అనుచరుడు, "ఏం చేస్తాం? ప్రజలు తమ అభిప్రాయం చెప్పారు"అన్నాడట. దానికి లేండన్, "మరీ ఇంతలా ఢంకా బజాయించి చెప్పాలా?" అని వాపోయాడట.

జీసస్ డయాపర్:

చంటి పిల్లలకు - మూత్రం పోసుకుంటే నేల తడవకుండా, వళ్ళు నానిపోకుండా ఇప్పుడు - డయాపర్స్ వాడడం బాగా ఎక్కు



వయింది. పూర్వం కూడా చంటి పిల్లలకు లంగోటీలు కట్టి ఆరారా మార్చుతూండేవారు. ఏసుక్రీస్తు చంటి పిల్లవాడుగా ఉన్నప్పుడు వాడిన లంగోటీని భద్రంగా దాచేరట. క్రీ.శ. 1175లో ఆ లంగోటీ అచ్చంగా ఏసుక్రీస్తు వాడినదేనని అప్పటి పోప్ మూడవ అలెగ్జాండర్ ధృవపర్చి ఉన్నాడట. మధ్య ఇటలీలోని స్పోలెట్ పట్టణంలోని చర్చిలో ఆ పవిత్ర చిహ్నం చాలాకాలంగా ఉందిట. అది దీర్ఘచతురస్రాకారంలో 25 సెంటీమీటర్ల పొడవూ, 20 సెంటీమీటర్ల వెడల్పూ ఉన్న ముతక గుడ్డ. ఏసుక్రీస్తు కాలంలో అలాంటి లంగోటీలే వాడేవారుట. ఎందుకో ఆ లంగోటీ గురించి 30 సంవత్సరాలుగా ఏ కబురూ లేదు. ఈఏడాది క్రిస్మస్ రాత్రి ఆ లంగోటీని స్పోలెట్ చర్చిలో ప్రదర్శిస్తారట!



వినాయక - షణ్ముఖ జననం

పిలవని పేరంటానికి వెళ్ళి దక్షయజ్ఞ కుండంలో ప్రాణత్యాగం చేసుకున్న సతీదేవి తిరిగి మేనకా హిమవంతుల కుమార్తెగా జన్మించి పార్వతి అయింది. ఆమె తపస్సు చేసి శివుణ్ణి మెప్పించి పరిణయమాడింది.

ఒకరోజు శివుడు పార్వతితో కలిసి మందర పర్వతం మీద విహరిస్తూ అక్కడి ప్రకృతి శోభకు పరవశించాడు. దేవశిల్పి విశ్వకర్మను తమకోసం అక్కడ అందమైన ఇల్లు కట్టమన్నాడు. విశ్వకర్మ తన ప్రతిభనంతా ప్రదర్శిస్తూ బంగారు మందిరాన్నక్కడ నిర్మించాడు.

శివపార్వతులు యథావిధిగా యజ్ఞం చేసి గృహ ప్రవేశం కావించారు. పార్వతి ఆ యింటి అందచందాలు చూసి తెగ మురిసిపోయింది. అప్పుడు శివుడామెను ఆట పట్టించాలని, "బంగారంతో కట్టడం వల్ల ఈ ఇల్లు నిన్ను మించి ప్రకాశిస్తోంది. నీవు నల్లని దానివి. మీ ఇద్దరికీ తేడా తెలియడం కోసం నిన్ను కాళీ అని పిలుస్తాను" అన్నాడు.

కాళి అనగా నల్లనిదని అర్థం. అందుకని పార్వతికి కోపం వచ్చింది. ఆమె శివుడితో, "నా వంటి రంగు నీకు నచ్చలేదని ఇప్పుడర్థమైంది. నీకు నచ్చే బంగారు ఛాయను సాధించేదాకా నేను నీకు కనిపించను. నీ మాటలు నా మనసును బాగా గాయపరిచాయి. మోడైన మాను తిరిగి చిగుర్చుతుంది. ఎన్నిసార్లు చెక్కనా గడ్డి మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతుంది. కానీ గాయపడిన మనసుకు అంత సులభంగా ప్రశాంతత లభించదు. మళ్ళీ నీవు నన్ను కాళీ అని పిలువకుండా నా వంటి రంగును మార్చుకుందుకు కఠోరమైన తపస్సు చేస్తాను" అని చెప్పింది. తర్వాత భర్తకు నమస్కరించి ఆకాశ మార్గంలో హిమాలయ పర్వతం చేరుకుంది. తన చెలికత్తెలైన జయ, విజయ, జయంతి, అపరాజితలను పిలిచి వారికి తన ఉద్దేశ్యం చెప్పి సాయం కోరింది.

చెలికత్తెలు సేవలు చేస్తూంటే పార్వతి ఒంటి

(అపూర్వ గాథలు)



కాలు మీద తపస్సు ప్రారంభించింది. బ్రహ్మ దేవుడి కోసం ఆమె అలా తపస్సు చేస్తూంటే ఒక పెద్ద పులి అక్కడకు వచ్చి భక్తిపూర్వకంగా పార్వతికి ప్రణామం చేసి, "అమ్మా! ఒంటి కాలి మీద నిలబడ్డావు. పడిపోయే ప్రమాదముంది. నీవు నన్నానుకుని నిలబడు" అంది.

పార్వతి కదలలేదు. పెద్దపులి ఆ చోటును విడిచిపెట్టలేదు. పార్వతి పడిపోలేదు. ఆమె పడిపోతుందన్న శంక పెద్దపులిని వీడలేదు. అలా వంద సంవత్సరాలు గడిచాయి. అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై పార్వతి శరీరానికి బంగారు ఛాయను ప్రసాదించాడు. కానీ పార్వతి అంతటితో తృప్తిపడక అంతకాలం తనను కనిపెట్టుకుని ఉన్న పెద్ద పులికి కూడా వరమివ్వమని పట్టుబట్టింది. బ్రహ్మ అంగీకరించి పెద్దపులికి గణపతిత్వము, శివభక్తి, అజేయత్వము, ధర్మం - శాశ్వతంగా ఉంటాయని వరమిచ్చాడు. శరీరానికి బంగారు రంగు రావడం వలన ఆనాటి నుండీ పార్వతి కనకదుర్గగా ప్రసిద్ధికెక్కింది.

కనకదుర్గ శివుడి వద్దకు వెళ్ళింది. శివుడామెను చూసి, "దేవీ! అసలే నీది అద్భుత సౌందర్యం. మేలిమి బంగారు ఛాయ నీ అందానికి వన్నె తెచ్చింది. ఇక మీదట ఒక్కక్షణం కూడా నిన్ను విడిచిపెట్టను" అంటూ ఆమెను అభ్యంతర మందిరంలోనికి తీసుకునివెళ్ళాడు.

పార్వతి మోహంలో పడి శివుడు లోకాలను విస్మరించాడు. భక్తులకూ, దేవతలకూ శివదర్శనం కరువయింది.

శివ తేజస్సు పార్వతి గర్భాన ప్రవేశించి తేజశ్శాలి అయిన పుత్రుడుదయిస్తాడనీ ఆ తేజశ్శాలి ఇంద్రస్థానాన్ని ఆక్రమిస్తాడనీ దేవతలు చెప్పుకోసాగారు. ఈ కబురు ఇంద్రుణ్ణి చేరింది. ఆయన కలవరపడి దేవతలందర్నీ వెంటబెట్టుకుని మందర పర్వతంలోని శివుడి మందిరాన్ని చేరుకున్నాడు. అయితే వారందర్నీ గుమ్మంలోనే నందీశ్వరుడు అటకాయించి, "అభ్యంతర మందిరంలో ఉన్న పార్వతీ పరమేశ్వరులు తమంతటతామే బయటకు వస్తారు. అంత వరకూ వేచి ఉండండి" అని చెప్పాడు.

ఇంద్రుడు, దేవతలు కొంతకాలం ఓపికగా అక్కడ ఎదురు చూశారు. శివపార్వతులు బయటకు రాలేదు కానీ హంసల గుంపు ఒకటి

యథేచ్ఛగా తరచూ లోపలకు వస్తూపోతూ కనిపించాయి వారికి. అప్పుడు దేవేంద్రుడా దేశించగా అగ్నిదేవుడు హంస రూపం ధరించి ఆ హంసల గుంపుతో కలిసి లోపలకు ప్రవేశించాడు. నంది ఆ విషయం తెలుసుకోలేకపోయాడు.

ఆ సమయంలో శివుడు, పార్వతి మంచి నిద్రలో ఉన్నారు. అగ్ని సూక్ష్మరూపం ధరించి శివుడి చెవివద్ద నిలిచి, "ప్రభూ! నీ కోసం ద్వారం వద్ద దేవతలెదురుచూస్తున్నారు" అన్నాడు.

శివుడు ఉలిక్కిపడి లేచి ద్వారం బయటకు వచ్చాడు. అప్పుడే పార్వతి కూడా ఉలిక్కిపడి లేచి స్నానాల గదిలోకి వెళ్ళింది.

శివ దర్శనం పొందిన దేవతలు శివుడికి భక్తితో నమస్కరించి, "వరదాయకా! పార్వతి పట్ల నీ మోహాన్ని ఉపసంహరించుకో. లోకాల పట్ల నీ ప్రసన్న దృష్టిని ప్రసరించు" అన్నారు.

శివుడు నవ్వి, "పందేళ్ళ విరహం తర్వాత నేను, పార్వతి కలుసుకున్నాం. మా మోహం ఇప్పట్లో తీరేది కాదు. ఈ మోహం కారణంగా నా తేజస్సుతో పుత్రుణ్ణి కనే దశకింకా పార్వతి చేరుకోలేదు. నా తేజస్సు పార్వతిని చేరుకునే దాకా లోకాల పట్ల నా దృష్టి మళ్ళదు. నేను మీరు కోరిన ప్రకారం చేయాలంటే మీలో ఎవరైనా నా తేజస్సును స్వీకరించి భరించాలి" అన్నాడు.

శివుడి తేజస్సును భరించగల శక్తి తమలో ఎవరికీ లేదని దేవతలు సంకోచించారు కానీ అగ్నిదేవుడొక్కడూ ముందుకు వచ్చి శివుడు



తనకు ముక్తిని కలిగించేవరకూ ఆ తేజస్సును మోస్తానని మాట ఇచ్చాడు. శివుడు అగ్నికి తన తేజస్సునిచ్చాడు. దేవతలు తృప్తిగా వెళ్ళిపోయారు.

ఈలోగా పార్వతి గజముఖం, చతుర్భుజాలు కలిగిన బొమ్మనొకటి నలుగుపిండితో చేసి స్నానాల గదిలో ఉంచింది. ఆ బొమ్మను చూసి ఆమె ఎంతో మురిసిపోతున్న సమయంలో శివుడక్కడకు వచ్చి జరిగింది చెప్పి, "దేవతలు మనకు మోహభంగం చేశారు. ఇప్పట్లో మనకు సంతాన యోగం లేదు" అన్నాడు.

పార్వతికి కోపం వచ్చింది, "ఈ దేవతలకు మనని బ్బంది పెట్టడం మినహా వేరే పనేమీ ఉన్నట్లు లేదు. ఇక మీదట దేవలోకం లోని వారికి తమ భార్యల ద్వారా సంతానం కలుగదు.



ఇది నా శాపం" అంది. శివుడామెను సముదాయిస్తూ, "తాత్కాలికంగా నీకు సంతానం లేదని దేవతలకు శాశ్వతంగా సంతానం లేకుండా చేయడం అన్యాయం కదూ!" అన్నాడు.

దీనికి పార్వతి మరింత ఆవేశపడి, "తాత్కాలికంగానైనా నాకు సంతానప్రాప్తి లేకుండా చేయగల వారెవ్వరు? నీ తేజస్సు దూరమైనప్పటికీ మన ఇరువురి మనసులూ ఒక్కటై కోరుకుంటే చాలు. త్రిలోక పూజ్యుడైన కొడుకు మనకు పుట్టడా?" అంది.

పార్వతి వాక్కు అమోఘమని తెలిసిన శివుడామెను శాంతపరచాలని జలక్రీడలారంభించాడు. ఆవిధంగా శివ పార్వతుల జలాభిషేకానికి నోచుకున్న పిండి బొమ్మకు పార్వతి అమోఘ వాక్కు జతపడి ప్రాణం వచ్చింది. ఆ గజముఖుడు తొండంతో నీటిని పీల్చుకుని ఘీంకరిస్తూ లేచాడు. తలిదండ్రులైన శివ పార్వతులకు నమస్కరించాడు.

ఆ గజముఖుడు తమ మానస పుత్రుడని గ్రహించిన శివపార్వతులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. అప్పుడు శివుడు పార్వతితో, "దేవీ! నీ పిండిబొమ్మ పుత్రుడు ఎవరి నాయకత్వం లేకుండా పుట్టాడు కాబట్టి వినాయకుడిగా పేరు పొందుతాడు. ఇతడిని పూజించిన వారిని విఘ్నములు బాధించవు కాబట్టి విఘ్నేశ్వరుడవుతాడు" అని దీవించాడు. పార్వతి కూడా, "ఇకనుండి వినాయకుడు ఘటోదరుడనే గణశ్రేష్ఠుడు, మాతృ గణాలు, విఘ్నకారులైన భూతాలు వగైరాల సేవలందుకుంటూ త్రిలోక పూజ్యుడవుతాడు" అని తన వంతుగా తనయుణ్ణి దీవించింది.

ఇక్కడిలా ఉంటే శివతేజస్సును మోస్తున్న అగ్నికి ఆ భారం అపారమయింది. ఆయన బాగా నీరసించిపోవడమే కాక ఆయన శరీరంలోని మాంసం, ఎముకలు, నెత్తురు, చర్మం మొదలైనవన్నీ బంగారు రంగులోకి మారిపోయాయి. అప్పట్నించీ అగ్నికి హిరణ్యరేతుడనే పేరు వచ్చింది.

శివ తేజస్సు నుంచి విముక్తి పొందే ఉపాయం అడగాలని అగ్ని దేవుడు బ్రహ్మ వద్దకు ప్రయాణమయ్యాడు. దారిలో ఆయనకు కుటిలానది కనిపించింది. అగ్నిదేవుడి అవస్థ

చూసి జాలిపడింది.

"నేను పురుషుణ్ణి. అందుకేనేమో శివ తేజస్సును మోయలేకపోతున్నాను. నీవు స్త్రీవి. ఈ శివ తేజాన్ని స్వీకరించి నాకు సాయపడగలవా?" అనడిగాడు అగ్ని.

కుటిలకు ఆయన్ను తిరస్కరించే ధైర్యం లేక, "మహానుభావా! శివ తేజస్సును నా నీటిలో విడిచిపెట్టు. ఆపైన జరిగేదేదో జరుగుతుంది" అంది. బ్రతుకు జీవుడా అనుకుంటూ అగ్ని శివ తేజస్సును కుటిలా నదిలో విడిచిపెట్టాడు. అప్పటికి గానీ కుటిలకు తన పొరపాటు అర్థం కాలేదు. శివ తేజస్సు కారణంగా ఆమెకు ప్రవాహమే భారమయింది.

అలా భారంగా ప్రవహిస్తున్న కుటిలానది ఒక పర్యాయం బ్రహ్మదేవుడి కంటబడింది. ఆయన అసలు విషయం తెలుసుకుని, "ఓ కుటిలా! శివతేజస్సును మోయడం నీవల్లకాదు. ఉదయ పర్వతం దగ్గర మూడు యోజనాల మహారౌద్ర శరవణం (రెల్లు బీడు) ఉన్నది. అక్కడ శివ తేజస్సును విడిచిపెట్టు" అని సలహా ఇచ్చాడు.

కుటిల శివ తేజస్సును శరవణం మీద విడిచిపెట్టింది. కొంత కాలం గడిచేక ఆ తేజస్సు పసిబాలునిగా మారి గుక్కపట్టి ఏడ్వసాగింది.

ఆ సమయంలో కృత్తికా దేవతలు ఆరుగురు ఎందుకో అలా వచ్చారు. ఏడుస్తున్న బాలుణ్ణి చూసి కృత్తికలు జాలిపడ్డారు. ఆ బాలుడికి పాలివ్వాలని వారు తమలో తాము పోటీపడుతూంటే ఆ బాలుడు ఆరు ముఖాలు ధరించి ఒకేసారి కృత్తికలందరి వద్దా పాలు తాగాడు.



అందుకని ఆ బాలుడికి షణ్ముఖుడని పేరు పడ్డాడు.

కృత్తికలా బాలుణ్ణి పెంచి పెద్ద చేశారు. అందుకని ఆ బాలుడికి కార్తికేయుడని కూడా పేరు వచ్చింది.

క్రమంగా కార్తికేయుడి గురించీ అతడి జన్మ వృత్తాంతమూ అన్ని లోకాలకూ పాకింది.

"ఆ తేజస్సును నేను మోశాను. అతడు నా కొడుకు" అంటూ అగ్ని, "అది నేనూ మోశాను" అంటూ కుటిలా కృత్తికల వద్దకు పరుగున వెళ్ళారు. వారి తగువు తీర్చలేక, పెంచిన ప్రేమ కారణంగా బిడ్డను వదులుకోలేక కృత్తికలు మీమాంస పడితే అగ్ని, కుటిల మహావిష్ణువు వద్దకు వెళ్ళారు.

"ఈ విషయంలో నేనేమి చెప్పగలను? తేజస్సు శివుడిది. ఈ బాలుడెవరికి చెందుతాడో శివుడే చెప్పగలడు" అన్నాడు శ్రీ మహావిష్ణువు.

అగ్ని, కుటిల శివుడి వద్దకు వెళ్ళారు. తన తేజస్సు బాలుడికి అవతరించినందుకు శివుడికి పరమానందమయింది. ఆయన పార్వతికీ విషయం చెప్పి భార్యను, అగ్ని, కుటిలలను వెంటబెట్టుకుని కృత్తికల వద్దకు వెళ్ళాడు.


"ఈ బిడ్డను పాలిచ్చి పెంచాం. మాకు తీర్పు చెప్పాలి" అని కృత్తికలు వేడుకున్నారు.

శివుడు నవ్వి, "కృత్తికల పుత్రుడు కాబట్టి కార్తికేయుడు. కుటిలానది పుత్రుడుగా కుమారుడు. గౌరీ పుత్రుడుగా స్కంధుడు. అగ్ని పుత్రుడుగా మహాసేనుడు. శరవణ భవుడు కాబట్టి శారద్వతుడు. ఆరు ముఖాలవాడుగా షణ్ముఖుడు. ఇవన్నీ ఈ బాలుడి పేర్లు. నా పుత్రుడిగా గుహుడన్న పేరుతో దేవతల సేనాధిపతియై అందరి పూజలూ అందుకోవలసిందిగా ఇతణ్ణి ఆజ్ఞాపిస్తున్నాను" అన్నాడు.

శివుడి మాటలకు అక్కడున్న వారేకాక సమస్తలోక జీవులూ సంతోషించాయి.

జె. మార్కండేయులు





చెకుముకి

వీరయ్య, సూరయ్య సత్తియ్య అనాథ యువకులు. ఒకేసారి ముగ్గురికీ అప్పటివరకూ బతికిన బతుకుపై రోత పుట్టింది. స్వతంత్రంగా జీవించాలన్న కాంక్షతో తమ ఊళ్ళు విడిచిపెట్టి ఒక అడవిలో ఒక పెద్ద రావి చెట్టు కింద విచిత్రంగా కల్సుకున్నారు. తమ బానిస జీవితాన్ని తల్చుకుని కొద్ది క్షణాలు బాధపడ్డారు. తాము ఆశించిన స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించమని దైవాన్ని ప్రార్థించారు.

ఆ సమయంలో ఆ రావి చెట్టు మీద నివసించే చెకుముకి అనే పిశాచం వారల సంభాషణ ఆలకించి కిందకి దూకింది "నన్ను చూసి భయపడకండి. మీ కోరిక విన్నాను. మీకు సాయపడతాను" అని చెప్పింది.

ముందుగా ఆ ముగ్గురూ పిశాచిని చూసి వణికిపోయారు. తదుపరి దాని మాట తీరుకి ధైర్యం కలిగి తమ కోరిక ఈడేరుతుందని ఆశపడ్డారు. పిశాచికి ప్రణామం చేశారు. వెంటనే,

"మీ కోరికలు చెప్పండి?" అని అడిగింది పిశాచం.

"నాకు అందమైన భార్య, పదెకరాలు మాగాణి, ఒక ఇల్లు కావాలి" అన్నాడు వీరయ్య.

"నాకు పెద్ద భవనం, చేపల చెరువు, చిన్న కోళ్ళ దొడ్డి, అప్సరస వంటి అర్థాంగిని ప్రసాదించు" అని సూరయ్య కోరాడు.


నాకు చిన్న ఇల్లు, అణకువ గల భార్య, కొద్దిగా పొలం చాలు" అన్నాడు సత్తియ్య.

చెకుముకి ముగ్గురి కోరికలూ శ్రద్ధగా విని, "మీరడిగింది పొందుతారు. తర్వాత నా కోరిక మీరు తీర్చాలి" అని షరతు పెట్టింది.

వీరయ్య, సూరయ్య సత్తియ్య ముక్త కంఠంతో అంగీకరించారు. అప్పటికి తన కోరిక చెప్పక, "మీరు కోరుకున్న జీవితాల్లో స్థిరపడ్డాక వచ్చి అడుగుతాను. అప్పుడు మాట తప్పకండి" అంది చెకుముకి. ముగ్గురూ తలలూపారు.

మరుక్షణం చెకుముకి ఆ ముగ్గురినీ వెంటబెట్టుకుని బయలు దేరింది. రెండు క్రోసుల

మాధవరపు కృష్ణ



దూరం నడిచాక దారి పక్క పంట పొలం, పెద్ద గృహం కనిపించాయి. ఒక అందమైన యువతి కూడా అక్కడ ఉంది. ఆమె వీరయ్యకి నచ్చింది. వెంటనే చెకుముకి ఆ ఇద్దరికీ గాంధర్వ వివాహం జరిపించి సూరయ్య సత్తియ్యలతో ముందుకి సాగిపోయింది.

మరో మూడు క్రోసులు నడిచివెళ్ళాక దారిపక్క ఒక పెద్ద భవనం, చేపల చెరువు, కోళ్ళ దొడ్డితో బాటు ఒక చక్కని చుక్క కంట పడింది. ఆ యువతి సూరయ్యకి నచ్చింది. చెకుముకి సూరయ్యను కూడా ఒక ఇంటివాణ్ణి చేసి సత్తియ్యతో కలిసి ముందుకు వెళ్ళిపోయింది.

కొంతదూరం వెళ్ళాక ఒక చెరువు పక్క కొంత పొలం, ఒక చిన్న తాటాకు ఇల్లు ఒక పేద పడుచు కనపడ్డారు వాళ్ళకి. సత్తియ్య ఆమెని ఇష్టపడితే, "ఆ పిల్ల అందగత్తె కాదు. ఇల్లా తాటాకులది పొలమా ఎంతో లేదు. రాబడి చాలక జీవితంలో సుఖసంతోషాలుండవు. ఇంకా ముందుకు వెడదాం" అంది చెకుముకి. సత్తియ్య ఒప్పుకోలేదు. చెకుముకి అతడి ఇష్టానుసారం ఆ యువతితో పెళ్ళి జరిపించి వెనుదిరిగి వెళ్ళిపోయింది.

కాలం ఆగదు. సంవత్సరాలు దొర్లిపోతున్నాయి.

ఒకరోజు చెకుముకి వీరయ్య ఇంటికి వెళ్ళింది. వీరయ్య దంపతులు అతిథి మర్యాదలు చేసారు. పిశాచం ఆనందించి, "ఇప్పుడు నా కోరిక తీర్చాలి" అని తన షరతును గుర్తు చేసింది. వీరయ్య - పిశాచాన్ని కోరిక ఏమిటో చెప్పమన్నాడు.

"నా వీపు మీద పెద్ద వ్రణం ఉంది. దానికి మందు లేదు. నా ఉపకారం పొందిన మానవుడు తన ఇంటికి స్వహస్తాలతో నిప్పు పెట్టి బూడిద చేసి ఆ బూడిద నా వ్రణం పైన అద్దిన వెంటనే వ్రణం మాయమౌతుంది. తక్షణం నీ ఇంటిని తగులబెట్టి మాట నిలబెట్టుకో" అంది చెకుముకి.

వీరయ్య ముందు నిర్ఘాంతపోయాడు. తర్వాత తెప్పరిల్లి తనింటిని చేజేతులా కాల్చుకోవడానికి మనసొప్పదనీ, అలాంటి పనికెవరూ ఒప్పరనీ చెకుముకితో అన్నాడు. చెకుముకి మాత్రం తన పట్టు విడవక మాట నిలబెట్టుకోమంది. అప్పుడు వీరయ్య చెకుముకిని తూలనాడి కసిరి పొమ్మన్నాడు. చెకుముకి వెళ్ళిపోతూంటే మాత్రం సాగనంప

డానికి ఇంట్లోంచి బైటకు వచ్చాడు భార్యతో సహా.

చెకుముకి బైటకి వచ్చి నడిచి కొద్ది దూరం వెళ్ళి వెనుదిరిగి చూసింది. మరుక్షణం వీరయ్య ఇల్లు, పంట పండిన పొలం సమస్తం కాలి బూడిదైపోయాయి. అది చూసి వీరయ్య, భార్య అదేపనిగా ఏడుస్తుంటే పిశాచం నవ్వుకుంటూ వెళ్ళి పోయింది.

తర్వాత చెకుముకి సూరయ్య దగ్గరకు వెళ్ళి తన కోరిక చెప్పింది. సూరయ్య కూడా వీరయ్య లాగే ప్రవర్తించి సర్వ నాశనమైపోయాడు.


అక్కడ నుండి చెకుముకి సత్తియ్య ఇంటికి వెళ్ళింది. సత్తియ్య దంపతులు పిశాచానికి అతిథి మర్యాదలు బాగా చేశారు. పిశాచం అడక్కుండానే సత్తియ్య, "నేను నీ కోరిక తీర్చ వలసి ఉంది. అదేమిటో చెబితే ఇప్పుడే తీర్చ గలను" అంటూ పాత విషయం గుర్తు చేశాడు. పిశాచం తన కోర్కెను చెప్పింది.


వెనువెంటనే వీరయ్య దంపతులు చెకుముకితో సహా బైటకు వచ్చారు. ఇంటి చూరుకి నిప్పు అంటించాడు.

క్షణాల్లో తాటాకుల కొంప కాలి బూడిదైంది. ఆ బూడిద కోసం ముందుకు వెళ్ళిన సత్తియ్య ఆశ్చర్యపడ్డాడు.

బూడిద కుప్ప మటుమాయమైంది. అక్కడ పెద్ద భవనం వెలసింది.

కొందరు దాసీలు హారతి పళ్ళెంతో ముఖ ద్వార బంధం వద్ద సత్తియ్య దంపతుల ఆగమనార్థం వేచి ఉన్నారు. సత్తియ్యకిదేమీ అర్థం గాక చెకుముకి వైపు చూశాడు. అదే క్షణంలో పిశాచం రూపు విడిచిన చెకుముకి సత్తియ్యకి ప్రణామం గావించి, "ఆర్యా! నేనొక గంధర్వుడను. ముని శాపంతో పిశాచాన్నయ్యాను. చేసిన ఉపకారం మరువని, ఆడిన మాట తప్పని వ్యక్తి వల్ల నాకు శాప విమోచన లభిస్తుందని నన్ను శపించిన ముని చెప్పాడు. ఈనాటికి నీ వల్ల నిజరూపం పొందాను" అంటూ అదృశ్యమయ్యాడు.





ఇద్దరు శిష్యులు

ధర్మవరంలో ధర్మన్న అనే పండితుండేవాడు. అతనికున్న పాండిత్యానికి ఏ గురుకుల విద్యా పీఠానికి వెళ్ళినా ఉపాధ్యాయ పదవికి కళ్ళ కద్దుకుని తీసుకుంటారు. కాని ఉన్న ఊరు కన్నతల్లి సమానం అనే సిద్ధాంతం ప్రకారం ధర్మన్న ఉన్న ఊళ్ళోనే ఉండి శిష్యులను కూర్చుకుని విద్యాబోధ చేస్తున్నాడు.

ధర్మన్న దగ్గర కులకర్ణి, భూషణం అనే ఇద్దరు విద్యార్థులు చదువు ముగించుకున్నారు. చదువు పూర్తి చేసుకున్న వాళ్ళిద్దరితో ధర్మన్న "నేను నాకొచ్చిన విద్యనంతా నేర్పాను. గురువు వికసించిన అందమైన పువ్వులాంటివాడు. శిష్యుడు దానికంటిన సువాసన లాంటివాడు. సువాసనవల్లే పుష్పానికి పేరు ప్రఖ్యాతులు వస్తాయి. మీకు ప్రఖ్యాతి వస్తే నాకు వచ్చినట్లే. మీ విద్యా గంధంతో పరిమళించి నాకు ఖ్యాతి తీసుకురావడమే మీరు నాకిచ్చే గురుదక్షిణ. ఈ లోకంలో మఱ్ఱి చెట్టు లాంటివాళ్ళు, విలువైన మణి ధరించిన పాము పడగలాంటివాళ్ళు, మంచి గంధం చెట్టు లాంటి వాళ్ళు ఉంటారు. ఎవరి నీడను చేరవలసి వచ్చినా మీరు చదువు వల్ల నేర్చుకున్న సంస్కారాన్ని మాత్రం మరిచిపోకండి" అని దీవించాడు.

కులకర్ణి, భూషణం గురువు ధర్మన్నకు పాదాభి వందనం చేసి ఇంటిదారి పట్టారు. దారిలో భూషణం, "మా అమ్మానాన్న పేదవాళ్ళు. ఒక పెద్ద ఉద్యోగి దగ్గర నౌకర్లుగా ఉన్నారు. నేను చదువుకుని వస్తే ఏదేనా మంచిపని ఇప్పిస్తానని ఆ అధికారి అన్నాడు. అందుకే నేను చదువుకున్నాను. ఏదో ఇంత జీతం వస్తే మా అమ్మనీ, నాన్ననీ పని మాన్పించి పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. మన గురువుగారికి ఈ కారణంగా నేనెంతో ఋణపడి ఉంటాను" అన్నాడు.

కులకర్ణి మెచ్చుకోలుగా చూసి, "నీ ఆశయం మంచిదే. కాని గురువుగారు చెప్పినట్లు మీ అమ్మానాన్నలు పనిచేస్తున్న ఉద్యోగి ఎటువంటి వాడో గమనించు. మఱ్ఱిచెట్టు ఆశ్రయమైతే

జె. ఉదయనాగశిరీష

ఇస్తుంది కాని దాని ఊడలతో అది విస్తరిస్తూ మరో చిన్నమొక్కను కూడా తన నీడలో పెరగ నివ్వదు. నెత్తిమీద మణి ఉంది కదా అని పాము దగ్గర ఎవరూ చేరరు. మనల్ని చూసి అసూయపడి మనల్ని అణగద్రొక్కేవాడు అటు వంటివాడే. మఱ్ఱిచెట్టు నీడలాంటి మనస్తత్వం, మణిభూషిత సర్పం లాంటి వాడు అవునో కాదో నిర్ణయించుకో. తనను నరికే గొడ్డలికి కూడా సువాసన అంటిస్తుంది మంచి గంధం చెట్టు. అటువంటి వ్యక్తిత్వం గలవాడైతేనే మీ అమ్మానాన్నలు పనిచేసే ఉద్యోగి దగ్గర చేరు. మన విద్య రాణించి పేరు తెచ్చుకోవాలన్న మన గురువుగారి కోరిక మరిచిపోకు'' అన్నాడు.

భూషణం, ''ఇన్ని కబుర్లు చెప్పావు కదా! మరినువ్వు ఏం చెయ్యదలచుకున్నావు. మంచి గంధం చెట్టు లాంటి వాళ్ళున్నా వాళ్ళను గుర్తించేటప్పటికి మన జీవితకాలం అయిపో తుంది'' అన్నాడు.

కులకర్ణి నవ్వుతూ, ''నేనూ పేదవాణ్ణే. మా నాన్నది కసాయి వృత్తి. మాంసాన్ని అమ్ముతాడు. నేనావృత్తినే స్వీకరించి పొట్టపోసుకుంటూ నేను నేర్చుకున్న విజ్ఞానాన్ని నలుగురికీ నేర్పుతూ చిన్న దీపం పెద్ద దీపాన్ని వెలిగించినట్లు గురువు గారందించిన విద్యాగంధంతో పరిమళిస్తాను'' అన్నాడు.

భూషణం పరిహాసంగా, ''అహింస పరమధర్మ మని మనం నేర్చుకున్నాం. నువ్వు మాంసాన్ని అమ్మితే - చదువుకున్న నీకూ, కసాయివాడైన మీ నాన్నకూ తేడా ఏమిటో నీ శిష్యులే నిర్ణ యించాలేమో!'' అన్నాడు.





కులకర్ణి నవ్వుతూ, "శాకాహారులు, మాంసాహారులు సృష్టి ప్రారంభం నుంచీ ఉన్నారు. మనం తినే కాయగూరలు, పండ్లు, అన్నంగా మారిన ధాన్యం ఇవన్నీ కూడా తిరిగి మొలకెత్తే గుణం కలిగి ఉన్నాయి. అంటే వాటికీ ప్రాణం ఉంది. ఈ లెక్కన చూస్తే శాకాహారులు కూడా జీవహింస చేస్తున్నారని ఒప్పుకోవాలి. మాంసాహారుల కోసం నేను కాకపోతే మరొకడు మాంసం అమ్ముతాడు. నేను వృత్తి ధర్మాన్ని స్వీకరించాను తప్ప నా కోసం నేను మాంసాన్ని అమ్మడం లేదు" అన్నాడు.

భూషణం, "నువ్వు చెప్పింది కూడా నిజమే. యజ్ఞం చేసేటప్పుడు మేకను చంపుతారు. పక్షులనీ, కుక్కలనీ, పిల్లులనీ పెంచే జీవకారుణ్యం తిండి దగ్గరకు వచ్చేటప్పటికి మరిచిపోయి జమీందారులు, రాజులు, పేదలు, ధనవంతులు శాకాహారం కన్నా, మాంసాహారానికే ప్రాముఖ్య మిస్తారన్నది జనద్విదితం. నువ్వు కులవృత్తినే స్వీకరించినా జీవకారుణ్యం మాత్రం నువ్వు విద్య నేర్పే విద్యార్థులకు బోధించడం మరిచిపోకు. చదువుకున్న విజ్ఞానం నలుగురికీ పంచేందుకే ప్రయత్నించాలి తప్ప ఉద్యోగం కోసం మాత్రమే వెంపరలాడకూడదనే నీ ఆశయం నాకు చాలా నచ్చింది. నాకు మాత్రం ప్రత్యేకమైన వృత్తిలేదు. అందుచేత ముందు ఉద్యోగం సంపాదించుకుని నా తల్లిదండ్రుల కానందం కలిగిస్తాను. ఆ తరువాతే విద్యాబోధన గురించి ఆలోచిస్తాను. మనకి దేవుడు మేలు చేస్తాడు" అంటూ కులకర్ణిని గాఢంగా కౌగిలించుకున్నాక వారు ఎవరి దారిన వాళ్ళు వీడిపోయారు.

కులకర్ణి కులవృత్తినే స్వీకరించి ధనం సంపాదించుకుంటూ నలుగురికీ విద్యాబోధ చేస్తూ పండితుడని పేరు తెచ్చుకున్నాడు. అతడేం పని చేస్తున్నాడన్నది కాక, అతడు విజ్ఞానం నేర్పుతున్న తీరు గొప్ప గొప్ప వాళ్ళ పిల్లలను కూడా శిష్యులయ్యేంతగా ఆకర్షించింది. అతడికి కలియుగ ధర్మవ్యాధుడని పేరు పెట్టి జనం కీర్తించసాగారు.

ఇక భూషణం ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు సంతోషంగా, "నాయనా! నీ కోసమే ఎదురు చూస్తున్నాం. మేము పనిచేస్తున్న యజమాని నీకు తప్పకుండా ఉద్యోగం కల్పిస్తాడు. రేపు వెళ్ళి కలు" అని దీవించారు.


భూషణం తన తల్లిదండ్రుల యజమాని

ఇంటివైపు బయలుదేరాడు. దారిలో అతడికి గ్రామాధికారి, వడ్డీ వ్యాపారి కనకయ్యతో కలిసి వస్తూ ఎదురుపడ్డాడు. భూషణానికి చటుక్కున గురువు ధర్మన్న చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. గ్రామాధికారి అధికారమనే మణి నెత్తిమీదున్న పాములాంటివాడు. కనకయ్య వడ్డీకి అప్పులిచ్చి తీర్చలేకపోతే తన దగ్గరే వెట్టి చేయించుకునే మఱ్ఱిచెట్టు లాంటివాడు. పైగా గ్రామాధికారి హామీ మీద కొడుకు తీర్చేలాగ కూతురి పెళ్ళి కోసం భూషణం తండ్రి కనకయ్య నుంచి అప్పు తెచ్చాడు. ఈ పాము పడగ నీడ, మఱ్ఱిచెట్టు నీడ వెంటనే ఎదురుపడినందుకు విచారించి - తప్పదు గనక నమస్కారం పెట్టాడు.

గ్రామాధికారి భూషణం కేసి మెచ్చుకోలుగా చూస్తూ, "ధర్మన్నగారి దగ్గర శిష్యరికం చేసి బయటకు వచ్చావంటే నీది సామాన్యమైన చదువు కాదు. నీ చదువుకు తగ్గ ఉద్యోగం మనూళ్ళో లేదు. చాలాదూరం వెళ్ళగలిగితే నీకు మంచి ఉద్యోగం నేను వేయిస్తాను. నీ తల్లిదండ్రులను కొంతకాలం విడిచిపెట్టగలనంటే చెప్పు" అన్నాడు.

వడ్డీ వ్యాపారి కంగారుగా, "అయ్యా! ఉద్యోగికి దూర భూమి, విద్వాంసునకు పరదేశము ఉండవు. భూషణం ఎక్కడైనా రాణించగలడు. గ్రామాధికారిగా మీరు న్యాయం చేయాలి. మీ హామీ మీద భూషణం అప్పు తీర్చేలా వీళ్ళ నాన్నకప్పిచ్చాను. ముందు నా దగ్గర పనిచేసి కొంత బాకీ చెల్లువేసి తిండి ఖర్చు వెళ్ళేలా జీతం తీసుకునే ఏర్పాటు చేయండి" అన్నాడు.

గ్రామాధికారి, "కనకయ్య చెప్పింది న్యాయంగా ఉంది. ప్రస్తుతానికి కనకయ్య దగ్గర




చేరు. నా వ్యవహారాలు కూడా చదువుకున్నావు కాబట్టి నా పనులూ అప్పచెపుతాను. నీ కష్టం ఉంచుకోనులే. లెక్కలు రాసినందుకు కనకయ్య బాకీకి కొంత జమ కట్టుకుని నీ పోషణ వెళ్ళి పోయేలా చూస్తాడు'' అన్నాడు దర్పంగా.

భూషణానికి గ్రామాధికారిని ఉబ్బేసి తప్పించుకోవడం తప్ప వేరే దారి లేదనిపించి, ''అయ్యా! మీరు మరిచిపోయినట్లున్నారు. నా గురించి ఇదివరకే నా తండ్రి పనిచేస్తున్న ఉద్యోగికి ఉద్యోగమిప్పించమని సిఫారసు చేసారు. మీ ఆశీస్సులతో ఆ ఉద్యోగంలో చేరదామని మీ ఇంటికి వస్తున్నాను. మీ మాటకు విలువిచ్చిన అధికారి దగ్గర చేరమంటారో, కనకయ్య గారి దగ్గర చేరమంటారో మీ ఇష్టం. మీ వ్యవహారాలు చూడ్డానికి నేనెప్పుడూ సిద్ధమే'' అన్నాడు గ్రామాధికారితో.

తనవల్లే ఉద్యోగం వచ్చిందన్నాడని గ్రామాధికారి చాలా సంతోషించాడు. కనకయ్య కేసి చూసి, ''చూశావయ్యా! నా మాటకు విలువ. చదువు కున్నవాళ్లు చదువుకున్నవాళ్ళే. మంచి జీతం వచ్చేలా చూడమన్నానని చెప్పు. కనకయ్య బాకీ మాత్రం జీతంలోంచి తీర్చెయ్యి'' అని ముందుకు సాగిపోయాడు. బాకీ పేరుతో భూషణం చేత వెట్టిచాకిరీ చేయించుకోవచ్చన్న ఆశ నిరాశ కావడంతో కనకయ్య ముఖం మాడ్చుకున్నాడు.

తనకు సహాయోద్యోగిగా ఉండేలా ఉద్యోగి మంచిజీతం మీద భూషణానికి ఉద్యోగ మిప్పించాడు. భూషణం ఉద్యోగంలో చేరి అందరి చేత మంచివాడనిపించుకున్నాడు. తనను నరికే గొడ్డలి మొనకు కూడా సుగంధమంటించే గంధపు చెట్టులా వ్యక్తిత్వ ముండాలనే విషయం అతడెప్పుడూ మరిచిపోలేదు. కులవృత్తి చేస్తూ ఒకడు. మంచి తనంతో మన్ననలు పొందుతూ ఉద్యోగం చేస్తూ ఇంకొకడు తమ విద్యను రాణింపచేసుకున్నందుకు తన ఇద్దరు శిష్యులను తలచుకుని ఆనందపడేవాడు ధర్మన్న.





స్వర్ణద్వీప యాత్ర

14

[విజయుడు, వినయుడు ఒకింట్లో పనికి చేరారు. వీరేంద్ర ద్వారా స్వర్ణద్వీప విశేషాలు మరిన్ని తెలుసు
కున్నారు. అక్కడి జ్ఞానులను కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే తెల్లవారు ఝామున అయిదు
గంటలకు వారి నేరాల గురించి విచారించడానికి చక్రవర్తి నుంచి పిలుపు వచ్చింది. వినయుడు
అధైర్యపడ్డాడు. ఆ తర్వాత....]

అది ఇంద్ర సభను మరిపించేటంత వైభవంగా ఉంది. ఎత్తైన సింహాసనం మీద స్వర్ణద్వీప చక్రవర్తి కూర్చుని ఉన్నాడు. ఆయన రత్నాలు పొదిగిన బంగారు కిరీటాన్ని ధరించి ఉన్నప్పటికీ ఆయన ముఖ తేజస్సుముందా కిరీటపు కాంతులు వెలవెలబోతున్నాయి. ఆయన ధరించిన దుస్తులపై పొదిగిన స్ఫటికాలు ఇంద్ర ధనుస్సు కాంతులను వెదజల్లుతూ కళ్ళు జిగేల్మనిపించేలా చేస్తున్నాయి.

ఆ సభలో మరికొందరు ప్రముఖులు కూడా సుఖాశీనులై ఉన్నారు. తేజస్సులో వారందరూ చక్రవర్తికి సాటివచ్చేలా ఉన్నారు.

అప్పుడొక రాజభటుడు విజయుణ్ణీ, వినయుణ్ణీ వెంటబెట్టుకుని సభలో ప్రవేశించాడు. చక్రవర్తికి వంగి వినయంగా నమస్కరించి, "స్వర్ణద్వీప చక్రవర్తికి జయము, జయము. తమ ఆదేశం ప్రకారం విజయ వినయులను తమ ముందు హాజరు చేస్తున్నాను" అన్నాడు.

చక్రవర్తి వారి వంక చూసి, "ముక్కుపచ్చలారని బాలురు మీరు. అయినప్పటికీ మీ నేరాలకు శిక్ష అనుభవించక తప్పదు" అన్నాడు.

విజయుడు చక్రవర్తి వంక సూటిగా చూసి, "తెలిసి నేరాలు చేసేవాళ్ళం కాదు. తెలియక చేసినా నేరానికి శిక్ష తప్పదని తెలియని వాళ్ళమూ కాదు. అయినా ముక్కుపచ్చలారని వాళ్ళని అంటూనే మా నేరాలకు సంజాయిషీ అడుగని న్యాయస్థానం ఎక్కడున్నా ఆశ్చర్యపోతాం. స్వర్ణ ద్వీపంలో అయినాసరే అది అనాగరికం-" అన్నాడు.

చక్రవర్తి విజయుడి వంక చూసి ముచ్చటగా

కైవల్యా వసుంధర



నవ్వి, "పిట్టకొంచెం, కూత ఘనం అంటే ఏమిటో నిన్ను చూసి తెలుసుకోవచ్చు. మీరు ఏ నేరం ఎప్పుడెలా చేశారో తెలుసుకునే సదుపాయం మాకున్నాక వేరే సంజాయిషీలెందుకు? నాగరిక ప్రాంతంలో ఎవరినీ అడుగకుండా చెట్ల, పొదుల రత్నాలు, ముత్యాలు వగైరాలు కోసుకోవడం తప్పని ఒకరు చెప్పాలా? అందుకే స్వర్ణద్వీపంలో సంజాయిషీలుండవు. నేరస్థులు రాజసభలో ప్రవేశించేది నేర విచారణకు కాదు. శిక్షను చెప్పడానికే" అన్నాడు.

"కానీ తమ భటుడు మాకు నేర విచారణ జరుగుతుందనే చెప్పాడు" అన్నాడు విజయుడు.

"ప్రస్తుతం స్వర్ణద్వీపంలో నేర విచారణ అంటే శిక్షను చెప్పడమే. ఆ శిక్ష లేమిటో ఈ పాటికి మీరు తెలుసుకునే ఉంటారు. మీలో ఒకడికి ఉరి. రెండోవాడికి ద్వీప బహిష్కార శిక్ష" అన్నాడు చక్రవర్తి గంభీరంగా.

"మీ సంప్రదాయాన్ని నేను మన్నిస్తున్నాను. తమరు కూడా మా సంప్రదాయాన్ని మన్నించి ఉరి శిక్షను నాకూ, ద్వీప బహిష్కార శిక్షను వినయుడికీ ప్రసాదించగోరుతున్నాను" అన్నాడు విజయుడు వినయంగా.

చక్రవర్తి భృకుటి ముడుతలు పడింది. ఆయన చిరుకోపంతో, "శిక్ష మీమీ నేరాలను బట్టి ఉంటుంది. నీ కోరికను బట్టికాదు" అన్నాడు.

అంతవరకూ మౌనంగా ఉన్న వినయుడు చటుక్కున, "చక్కగా సెలవిచ్చారు ప్రభూ! దొంగతనం నేను చేశాను. ఉరిశిక్ష నాకే పడాలి" అన్నాడు.

విజయుడు వినయుడి వంక కోపంగా చూసి, "యువరాజుగా నిన్నాదేశిస్తాను. కాసేపు నోరు విప్పి నీవు మాట్లాడవద్దు" అని - అప్పుడు చక్రవర్తి వైపు తిరిగి, "ప్రభూ! నేను చంపక దేశపు యువరాజును. ఈ వినయుడు మా మంత్రి కుమారుడు. నేను పక్కన ఉండగా ఇతడే తప్పు చేసినా అది నాదే అవుతుంది. అది మా సంప్రదాయం. మాకే కాదు ఎక్కడైనా సరే అదే ఉత్తమ సంప్రదాయం" అన్నాడు.

"అదెలాగో చెప్పు - వింటాను" అన్నాడు చక్రవర్తి.

"పదునాలుగు సంవత్సరాలు వచ్చే దాకా పిల్లలు చేసిన తప్పులకు తలిదండ్రులే బాధ్యత వహించాలి.

ఇవి ఏ నాగరికతకైనా ఉత్తమ సంప్రదాయం. ఒప్పుకుంటారా?" అన్నాడు విజయుడు.

చక్రవర్తి అంగీకార సూచకంగా తలాడించాడు.

"రాజు ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకోవాలని శాస్త్రం చెబుతుంది. అంటే రాజు ప్రజలకు తండ్రి వంటి వాడు. అంటే రాజుగా ఉన్నంత కాలం ప్రజల తప్పులకు రాజే బాధ్యుడు. నేను యువరాజు హోదాలో ఇల్లు వదలిపెట్టాను. వినయుడు నా ప్రజల్లో ఒకడు. కాబట్టి ఇతడి తప్పు నాదవుతుంది. కాదంటారా?" అన్నాడు విజయుడు.

చక్రవర్తి అప్రయత్నంగా, "శహభాష్ యువరాజా!" అని, "తమ తప్పులకు ప్రజల్ని బలిచేసే రాజుల గురించి విన్నాను. ప్రజల తప్పులకు బాధ్యత వహించి శిక్ష పొందాలనుకునే నీ వంటి రాజును చూడడం నాకెంతో సంతోషంగ ఉంది" అన్నాడు.

"ప్రభూ! ఇందులో నన్ను మెచ్చుకునేటంత విశేషమేముంది? నేను నా బాధ్యతను నిర్వహిస్తున్నాను. అయినా కొంతసేపు బాధ్యతను నిర్వహించక పోవడం నా తప్పు. ఎందుకంటే ప్రజలు తప్పు చేస్తే రాజు వారిని సంస్కరించాలి. మళ్ళీ అలాంటి తప్పులు చేయకుండా ప్రభావితం చేయాలి. కానీ నేను పక్కనే ఉండి వినయుడు తప్పు చేస్తూంటే ఆపడానికి గట్టి ప్రయత్నం చెయ్యలేదు. అందువల్ల కూడా అతడి తప్పుకు పూర్తి బాధ్యత నాది. అయితే మీరిప్పుడు నన్ను మెచ్చుకున్నారు కాబట్టి నాదొక చిన్న మనవి" అన్నాడు విజయుడు.

"నీ మనవి వినడానికి నాకభ్యంతరం లేదు.





కానీ నేను మెచ్చుకున్నాను కదా అని శిక్షను తప్పించుకోవాలనుకోకు. నేను నీ గుణగణాల్ని మెచ్చుకున్నాను. అయినా నేరం నేరమే - ఎంత మంచివాడు ముట్టుకున్నా నిప్పు కాల్చకుండా ఉంటుందా?" అన్నాడు చక్రవర్తి.

"ప్రభూ! శిక్షను తప్పించమని నేనడగనే అడగను. నా తర్కానికి ఒప్పుకున్నారు కాబట్టి ఉరిశిక్ష నాకే విధించమంటున్నాను" అన్నాడు విజయుడు.

దీనికి చక్రవర్తి అంగీకరిస్తూ, "సరే, నీవు కోరినట్లే జరుగుతుంది" అన్నాడు.

ఇక వినయుడు తట్టుకోలేక, "విజయా! ఇది అన్యాయం. తప్పు నాది. కాబట్టి శిక్ష నాకే పడాలి" అన్నాడు.

విజయుడు తల అడ్డంగా ఊపి, "నేను రాజుని. న్యాయాన్యాయాలు నిర్ణయించడం నా వంతు. నా నిర్ణయానికి తలవంచడం నీ వంతు. చివరి క్షణాల్లో రాజు మాట కాదనే తప్పు చేయకు. ఎలాగూ నేను చెప్పినట్లే జరుగుతుంది. కానీ నీ తప్పువల్ల పోయేటప్పుడు నాకూ, ఆ తర్వాత జీవితాంతం నీకూ మనశ్శాంతి ఉండదు" అంటూ వినయుణ్ణి గట్టిగా హెచ్చరించాడు.

"నేను సామాన్యుణ్ణి. అన్నింటికీ నీమీదే ఆధారపడినవాణ్ణి. నీవు లేకుండా ఒక్క క్షణం కూడా బ్రతకలేని అసమర్థుణ్ణి. నావంటి వాడు బ్రతకడం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. కానీ నీవు అసమాన సాహస ప్రతాపవంతుడివి. వివేకివి. నేను లేకపోయినా నువ్వు జీవించగలవు. నీ వల్ల ప్రపంచానికి ఎంతో ప్రయోజనముంది. కాబట్టి ఉరిశిక్ష నాకే పడాలి" అన్నాడు వినయుడు పట్టుదలగా.

చక్రవర్తి వారిరువురి త్యాగ గుణాలనూ ప్రశంసించి, "నా ప్రశంసలు మీ గుణగణాలకే. మీ నేరాలకు శిక్షలు తప్పవు. అయితే మీ ఇద్దరికీ అరగంట వ్యవధి ఇస్తున్నాను. ఒకరితో ఒకరు చర్చించుకుని ఇద్దరూ కలిసి ఏక నిర్ణయానికి రండి. ఇద్దరూ ఏక నిర్ణయానికి రాలేని పక్షంలో విజయుడు కోరిన ప్రకారం జరుగుతుంది" అన్నాడు.

అప్పుడు రాజభటుడు వారిద్దరినీ సభలో ఒక మూలగా తీసుకుని వెళ్ళాడు. అక్కడ విజయుడు, వినయుడు శిక్ష గురించి మాట్లాడుకున్నారు.

వినయుడు ఉరిశిక్ష తనకే పడాలని మొండిగా వాదించాడు.

విజయుడు చివరకు, "ఉరిశిక్ష అంటే మృత్యుదేవతతో పోరాటమని నీకు తెలుసును కదా!" అన్నాడు.

"తెలుసు!" అన్నాడు వినయుడు.

"మనిద్దరిలో నేనే ఎక్కువ సమర్థుడినని ఒప్పుకుంటావా?" అన్నాడు విజయుడు.

"ఒప్పుకుంటాను" అన్నాడు వినయుడు.

"అయితే మృత్యుదేవతతో పోరాటానికి నువ్వే వెడతానంటావేం? నేను మృత్యుదేవతను జయించలేనని నీ అపనమ్మకమా? నా సమర్థతను నీవు శంకిస్తున్నావా?" అన్నాడు విజయుడు కోపంగా

వినయుడాలోచనలో పడ్డాడు.

అప్పుడు విజయుడు - తనకింకా ఆయువు తీరలేదనీ, మృత్యువు తన దరికి రాబోదనీ వినయుడికి నచ్చజెప్పి మొత్తంమీద ఏకాభిప్రాయానికి రప్పించి, "నువ్వేమన్నా నా మాటే నెగ్గుతుందని చక్రవర్తి మాట ఇచ్చాడు. అయినా నిన్నొప్పించడంలోనే నాకానందముంది" అని చెప్పాడు.

విజయ వినయులిద్దరూ ఏకాభిప్రాయానికి రాగానే చక్రవర్తి ఎంతో సంతోషించి సభామధ్యంలో ఉరిశిక్షకు ఏర్పాట్లు చేయవలసిందిగా రాజభటుల నాదేశించాడు.

విజయుడు, వినయుడు చూస్తూండగా సభాప్రాంగణ మధ్యంలో రత్నకంబళీ తప్పుకుంది. వేదిక ఒకటి పైకి లేచింది. ఆ వేదికపై ఉరికంబ మున్నది. వ్రేలాడుతున్న ఉరి త్రాడు పక్క నల్లని





రాక్షసాకారుడున్నాడు.

"బాలుడా! వేదికనెక్కు" అన్నాడు చక్రవర్తి.

విజయుడు వేదికను సమీపించాడు. వినయుడు కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు. విజయుడు వేదిక మెట్ల వరకూ వెళ్ళి ఆగిపోయి, "ప్రభూ! స్వర్ణద్వీపం సిరిసంపదలలో, విజ్ఞానంలో ఎంతో అభ్యున్నతిని సాధించింది. కొబట్టి ఉరిశిక్షకు ముందు నా చివరి కోర్కెలు తీర్చమని అడిగితే - తీర్చాలన్న సంస్కారం ఇక్కడి చట్టంలో ఉంటుందని నేనాశిస్తే అది తప్పవుతుందా?" అన్నాడు.

మిత్రుడేదో తిరకాసు పెడుతున్నాడని అర్థమై వినయుడి కళ్ళు మెరిశాయి. కానీ అతడి ఆశలను త్రుంచివేస్తూ, "తప్పు లేదు. నీ కోర్కెలు అనుచితం కాకపోతే వాటిని తప్పకుండా తీర్చగలను" అన్నాడు చక్రవర్తి.

ఉరిశిక్ష తప్పించడం అనుచితమే అవుతుంది కాబట్టి విజయుడలాంటి కోరిక కోరడు. మరే కోర్కె కోరుతాడోనని కుతూహలంగా చెవులు రిక్కించాడు వినయుడు. మిత్రుడు, తను కలసి తిరిగివెళ్ళాలని అతడి గాఢమైన కోరిక.

"ప్రభూ! ఇక్కడి జ్ఞానులను కలుసుకుని కొన్ని సందేహాలు తీర్చుకోవాలి. వాటిని వినయుడి ద్వారా కొందరికి చేరవేయాలి. ఇది నా మొదటి కోరిక-" అన్నాడు విజయుడు నిశ్చలంగా.

"నీ కోర్కె తీరేది కాదు. ఎందుకంటే నీవు నేరస్థుడివి. నేరస్థులను స్వర్ణద్వీపజ్ఞానులు చూడరు" అన్నాడు చక్రవర్తి.

విజయుడు నవ్వి, "ప్రభూ! నేను వినయుడి నేరానికి బాధ్యత వహించాను కాబట్టి శిక్షార్హుడి నయ్యాను. స్వయంగా నేరం చేసి ఉండలేదు కాబట్టి నేను నేరస్థుణ్ణి కాదు. అందువల్ల నన్ను జ్ఞానులు చూడవచ్చు. నాతో మాట్లాడవచ్చు" అన్నాడు.

చక్రవర్తి అతడి వంక ముచ్చటగా చూస్తూ, "ఇంత చిన్న వయసులో ఇంతటి మేధాశక్తి స్వర్ణద్వీప వాసులకు కూడా అసాధ్యం. మీరిద్దరూ ఇప్పుడే స్వర్ణద్వీపజ్ఞానులను కలుసుకుని మాట్లాడే ఏర్పాటు చేస్తున్నాను. అయితే ఒక గంటసేపు మాత్రమే వారు మీతో ముచ్చటించగలరని గుర్తుంచుకుని మీ సమయాన్ని వినియోగించు

కోండి" అన్నాడు.

అయనలా మాట ముగించాడో లేదో విజయ వినయులిద్దరూ సభా ప్రాంగణం నుంచి మాయమై ఓ కొత్తచోటు చేరుకున్నారు.

అది అందాల పూల వనంలా ఉంది. మనసుకు పరవశం కలిగించే పరిమళాలు ఆ ప్రాంత మంతటా వ్యాపించి ఉన్నాయి. పైకి చూస్తే ఆకాశం కనబడుతోంది. బాలభానుడి కిరణాలు అప్పుడే భూమ్మీద పడుతున్నాయి. కానీ అవి చురుక్కు మనడం లేదు. వెన్నెలలా ఆహ్లాదం కలిగిస్తోంది.

విజయుడు, వినయుడు పరసరాలు చూస్తూంటే వారిముందు అయిదుగురు ఆజాను బాహులు ప్రత్యక్షమయ్యారు. వారు పొడవాటి అంగీలు ధరించి ఉన్నారు. తెల్లటి, పొడవాటి గెడ్డాలు వారికి హుందానిచ్చాయి.

"చక్రవర్తి అనుమతి లేనిదే పరులెవ్వరూ ప్రవేశించలేని గాజు మేడ ఇది. మీ మనసులో ఉన్న ఒకో సందేహం తీర్చడానికి ఒకో మనిషిగా వచ్చాం. మొత్తం అయిదు ప్రశ్నలు మీరడగవచ్చు" అన్నాడు వారిలో ఒకడు.

వారే స్వర్ణద్వీప జ్ఞానులని అర్థమై విజయ వినయులిద్దరూ గౌరవ పూర్వకంగా వంగి నమస్కరించారు. ముందుగా విజయుడు స్వర్ణ ద్వీపంలోని వీరేంద్ర గురించి చెప్పి, "అతడి ఆశకు అంతెప్పుడు?" అనడిగాడు.

"అతడికే కాదు. ఎవరి ఆశకూ అంతుండదు. లక్ష్య సాధనతో తృప్తి పడాలి" అని ఒక జ్ఞాని మాయమైపోయాడు.

ఆవిధంగా మరి నాలుగు ప్రశ్నలు వేశాక జ్ఞానులందరూ మాయమైపోగా విజయ వినయులిద్దరూ



తిరిగి రాజసభా ప్రాంగణంలో ప్రత్యక్షమయ్యారు.

"నీ మొదటి కోర్కె తీర్చాను. రెండవ కోర్కె చెప్పు." అన్నాడు చక్రవర్తి.

"నా రాజ్యమైన చంపకదేశం కలకాలం సుభిక్షంగా ఉండేటంత ధనం, సంపదలను తమరు వినయుడి కిచ్చి పంపాలి" అన్నాడు విజయుడు.

చక్రవర్తి తల అడ్డంగా ఊపి, "దేశ బహిష్కార శిక్ష విధించిన వాడికి డబ్బిచ్చి సత్కరించి పంపడం ఉచితం కాదు" అన్నాడు.

"ప్రభూ! దేశ బహిష్కార శిక్ష నాకు విధించ బడింది. వినయుడికివ్వబడింది ఉరిశిక్ష మాత్రం. ఇప్పుడా శిక్షను నాకు మార్చారు కాబట్టి వినయుడిక నేరస్థుడూ కాదు. అతడికి డబ్బిచ్చి సత్కరించి పంపడం అనుచితమూకాదు" అన్నాడు విజయుడు.

"శహభాష్ బాలరాజా! నీ చతురతకు మెచ్చాను" అంటూ చక్రవర్తి గాలిలోకి చేతులు సాచాడు. అప్పుడాయన చేతిలోకి ఒక సంచీ వచ్చింది, "ఇది మాయసంచీ. కోరిన ధనాన్నీ, సంపదనూ అపారంగా ఇవ్వగల ఈ సంచీని వినయుడికిచ్చి నీ రెండవ కోర్కెను కూడా తీర్చుతున్నాను. ఇక నీవు వేదికనెక్కి ఉరికి సిద్ధపడు" అన్నాడు.

విజయుడు చూస్తూండగా ఆ మాయసంచీ గాలిలో తేలుతూ వచ్చి వినయుడి చేతుల్లో వాలింది. అది చూసి విజయుడు తృప్తిగా తలాడించి మెట్లెక్కి వేదికపైకి చేరుకున్నాడు. ఉరికంబాన్ని సమీపించి ఉరి త్రాడు మెడకు తగిలించుకున్నాడు. రాక్షసాకారుడు అతణ్ణి ఉరితీయడానికి సిద్ధంగా ఉన్నాడు.

"ఇక విజయుడి ప్రాణాలపై ఆశలేదు. నా ప్రాణాలకు తెగించి నేనే ఏదైనా చెయ్యాలి" అనుకుంటూ వినయుడు ముందడుగు వేయబోయే టంతలో అక్కణ్ణించి మాయమైపోయి ఒక కొత్త ప్రాంతం చేరుకున్నాడు. ఎదురుగా కనబడిన సుధాముణ్ణి గుర్తించి తాను దగ్ధనగరం చేరు కున్నానని గ్రహించాడు.....

[ఇంకా ఉంది]





ఫిర్యాదు

అల్లినగరంలో ఉండే గోపయ్య పండితుడు. అతడు రాజుగారు నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని, రాజుగారి నుండి రత్నపుటుంగరం బహుమానంగా పొందాడు. తర్వాత ఒకసారి తన మిత్రుడికి చూపిద్దామనుకుంటే ఎంత వెదికినా ఆ రత్నపుటుంగరం కనబడలేదు. వెంటనే గోపయ్య, తన ఉంగరం పోయిందంటూ నగర కొత్వాలుకు ఫిర్యాదు చేశాడు. రాజుగారు బహుమతిగా ఇచ్చినదని తెలియడంతో, తప్పకుండా అది దొరికేట్లు చేస్తానని కొత్వాలు గోపయ్యకు హామీ ఇచ్చాడు.

కొద్దిరోజుల తరువాత గోపయ్య దేనిగురించో వెతుకుతున్నప్పుడు భోషాణం పెట్టె అడుగు అరలో రత్నపుటుంగరం కనిపించింది. అనవసరంగా కంగారుపడి ఫిర్యాదు చేసినందుకు నొచ్చుకుని, ఫిర్యాదు వాపసు తీసుకుందామని కొత్వాలు దగ్గరకు వెళ్ళాడు.

"ఈ విషయమై నేను పదిమందిని నిర్బంధంలోకి తీసుకున్నాను. అందులో నలుగురు తామే రత్నపుటుంగరం తీశామని వప్పుకున్నారు కూడా. ఇంత జరిగాక ఇప్పుడు మీరు ఫిర్యాదు వాపసు తీసుకుంటాననంటే ఎలా?" అన్నాడు కొత్వాలు చిరాగ్గా.

— మాడుగుల రాము



దెయ్యాల సహాయం

పంచవటిలో నివసించే మాణిక్యానికి అస్వస్థురాలైన తల్లి తప్ప నా అన్న వారెవ్వరూ లేరు. వారి కుటుంబానికి పూట గడవడం కష్టంగా ఉన్నా మాణిక్యం ధైర్యాన్ని కోల్పోలేదు.

మాణిక్యం సన్నగా ఉంటుంది కానీ జబ్బపుష్టికల మనిషి. అందుకని ఆమె గొడ్డలి తీసుకుని దగ్గర్లో ఉన్న అడవికి వెళ్ళి తన శక్తి మేరకు కట్టెలుకొట్టి వాటిని అమ్మగా వచ్చే డబ్బుతో సంసారాన్ని నెట్టుకుని వస్తోంది.

ఆమె వెళ్ళే అడవిలో ఒక రావి చెట్టుంది. దానిమీద రెండు దెయ్యాలుంటున్నాయి. బ్రతికి నంత కాలమూ చెడ్డ పనులే చేయడం వల్ల - చనిపోయాక దెయ్యం రూపాలు తెచ్చుకున్న మనుషులే అవి.

దెయ్యాలుగా మారేక వాటికి అద్భుత శక్తులు చాలా వచ్చాయి కానీ దెయ్యపు రూపం వల్ల అవి సుఖపడలేకపోతున్నాయి. దెయ్యపు రూపం నుంచి విముక్తి పొందేదెలాగా అని తర్జన భర్జన పడి చివరికవి ఒకసారి తమ చెట్టు క్రింద కూర్చున్న బైరాగి నడిగాయి. పుణ్యాత్ములకి సాయం చెయ్యమని సలహా ఇచ్చి వెళ్ళిపోయాడాయన.

అప్పట్నించీ ఆ రెండు దెయ్యాలూ జన్మవిముక్తి కోసం ఎదురుచూస్తున్నాయి. ఒక రోజున మాణిక్యం వాటికంట పడింది. మాణిక్యం చాలామంచిదనీ, పుణ్యాత్మురాలనీ తేల్చుకుని ఆమెకు సాయపడా లనుకున్నాయి.

ఒక రోజున మాణిక్యం వచ్చేసరికి దెయ్యాలు రెండూ - పెద్దపెద్ద కట్టెల మోపులు రెండు సిద్ధం చేసి ఉంచాయి.

మాణిక్యం వచ్చి కట్టెల మోపులు చూసి, తనకంటే ముందే వచ్చి ఎవరో కట్టెలు కొట్టు కున్నారని అనుకుంది, "చాలాపెద్ద మోపులే కట్టారు. అంటే వాళ్ళెవ్వరో నాకంటే బలవంతులు, శక్తివంతులు. నేనిక వారితో పోటీ పడలేను. ఇక మీదట కట్టెలు కొట్టడం మాని కొత్త పని చూసు

(రాజస్తాన్ జానపద కథ ఆధారంగా)

కోవాలి" అనుకుంటూ ఆమె అడవికి రావడమే మానుకుంది.

జరిగిందానికి చాలా విచారించిన దెయ్యాలు మరో విధంగా మాణిక్యానికి సాయపడాలనుకుని ఆమెను వెదుక్కుంటూ వెళ్ళాయి.

అప్పుడు మాణిక్యం పంచవటి పొలి మేరల్లో ఉన్న పూల దుకాణంలో పూలమాలలు కట్టే పని చేస్తోంది. అక్కడికి చేరిన దెయ్యాలు మాణిక్యం పక్కనున్న బుట్టను జాజులు, మల్లెలు, కనకాంబరాలు, మొదలైన పూలతో నింపేశాయి.

ఎన్ని మాలలు కట్టినా బుట్టలోని పూలు తరగడం లేదు. ఇంతలో అటుగా వచ్చిన దుకాణం యజమాని - మాణిక్యం కట్టిన మాలలు, బుట్ట నిండుగా ఉన్న పూలు చూసి గుండె బాదుకుని, "నీ వాలకం చూస్తుంటే మనిషిలా లేవు. మాయలు, మంత్రాలు నేర్చిన పిల్ల పిశాచిలా ఉన్నావు-" అని ఆమెను వెళ్ళిపొమ్మన్నాడు.

మాణిక్యం నీరసపడి పోలేదు. ఆమెకు బొమ్మలు చేయడం వచ్చు. అందుకని కాలవ ఒడ్డుకు వెళ్ళింది. అక్కడ ఒండ్రుమట్టిని సేకరించి ఒకచోట ముద్దగా పోసి బొమ్మలు తయారు చెయ్యడం మొదలుపెట్టింది.

ఆమెకు సాయపడడంలో ముచ్చటగా మూడో ప్రయత్నం చేద్దామనుకున్నాయి దెయ్యాలు. అవి జమీందారు ఇంటినుంచి విలువైన రత్నాలహారాన్ని సంగ్రహించి మాణిక్యం ముందున్న ఒండ్రుమట్టిలో పడేశాయి.

పనిలో ఉంటే మాణిక్యానికి సమయం తెలియదు. పరిసరాలుతెలియవు. ఆమె రత్నాల హారాన్ని గమనించనే లేదు. ఆ హారం ఆమె తయారుచేసిన



ఏనుగు బొమ్మ పొట్టలో ఇరుక్కుని ఉండి పోయింది.

తయారు చేసిన బొమ్మలను ఎండబెట్టి రంగులు వేశాక అవి ఎంతో బాగున్నాయి. జమీందారు ఒక్కడే మొత్తం బొమ్మలన్నింటినీ కొనేశాడు.

జమీందారు పిల్లలకు ఏనుగు బొమ్మ బాగా నచ్చింది. వాళ్ళు దానితో ఆడుకుంటూంటే చేయి జారి క్రిందపడి పగిలిపోయిందా బొమ్మ. అప్పుడా బొమ్మలోంచీ రత్నాలహారం బయటపడింది.

జమీందారా హారాన్ని చూసి అది తన దివాణంలోనిదేనని గ్రహించాడు. వెంటనే మాణిక్యాన్ని పిలిపించి సంజాయిషీ అడిగాడు.

మాణిక్యానికి కళ్ళనీళ్ళ పర్యంతమయింది. ఆమె జమీందారు కాళ్ళమీద పడి తనకేమీ తెలియదని మొరపెట్టుకుంది.


కాసేపటికి జమీందారు శాంతించి నిజానిజాలు విచారించాడు. మాణిక్యానికి దివాణం దరిదాపుల్లో అడుగుపెట్టే అవకాశం లేదు కాబట్టి ఆ హారాన్ని ఏకాకో, కోతో ఎత్తుకెళ్ళి మట్టిలో పడేసి ఉండొచ్చునని సరిపెట్టుకున్నాడాయన. అనవసరంగా మాణిక్యాన్ని అనుమానించినందుకు జాలిపడి ఆమె పరిస్థితులు తెలుసుకుని దివాణంలో పనిచేస్తున్న ఓ మంచి యువకుడితో ఆమెకు పెళ్ళి జరిపించాడు. దాంతో మాణిక్యం కష్టాలు తీరిపోయాయి. భర్త మాణిక్యం తల్లినీ ఆదరించాడు.

ఇక మాణిక్యానికి తమ అవసరం తీరిపోయిందని తెలిసి దెయ్యాలు రెండూ ఎంతో బాధపడు తూంటే చెట్టు క్రిందకు మళ్ళీ బైరాగి వచ్చాడు. తాము చేయబోయిన ఉపకారాలన్నీ మాణిక్యానికి ఆపదలే తెచ్చిపెట్టడానికి కారణమేమిటని అవి బైరాగినడిగితే, "మీరు స్వార్థబుద్ధితో ఆమెకు సాయపడ్డారు. అందుకే మీ సాయం ఫలించలేదు. నిస్వార్థ బుద్ధితో సాయపడండి. మీ సాయం తప్పక ఫలిస్తుంది" అన్నాడు బైరాగి.

దెయ్యాలకు రహస్యం తెలిసింది. కానీ ఎంత కాలమైనా ఇంకా వాటికి మోక్షం కలగలేదు.

— పుష్యమి





సునీల్ బొమ్మ

విశాలపురంలో ఒక చిత్రకారుడుండేవాడు. ఆయన వద్ద ఎందరో చిన్నపిల్లలు బొమ్మలు గీయడం నేర్చుకునేవారు. వారిలో సునీల్ అనేవాణ్ణి ఆయన ఎక్కువగా అభిమానించేవాడు.

మిగతా పిల్లలకు సునీల్ బొమ్మలు అంతగా నచ్చేవికాదు. వాళ్ళు ఆ విషయం గురువుగారికి చెబితే ఆయన ఒక రోజున మొత్తం పిల్లలందర్నీ వంట గది బొమ్మ వేయమని చెప్పాడు. వంట గదిలో మనుషులెవరూ ఉండకూడదని కూడా ఆయన సూచించాడు.

పిల్లలందరూ బొమ్మలు గీశారు. కొందరైతే వంటగదిని అచ్చుగుద్దినట్లు వేశారు. అయినాసరే గురువు సునీల్ బొమ్మే బాగుందన్నాడు. వాడి బొమ్మ అచ్చు గుద్దినట్లు లేదుకానీ అక్కడ పిల్లి ఒకటి ఉంది.

"వంటింట్లో పాలుంటాయి. ఎలుకంటాయి. మనుషులు లేనప్పుడు అక్కడ పిల్లి తిరుగుతుంది కదా" అని సునీల్ సంజాయిషీ ఇచ్చాడు.

"చిత్రకారుడంటే అచ్చుగుద్దినట్లు బొమ్మను చిత్రించడం కాదు. ఊహ కూడా ఉండాలి. అదీ సునీల్ ప్రత్యేకత" అన్నాడు గురువు.

పిల్లలందరికీ అసలు విషయం తెలిసి సునీల్ విషయమై ఏర్పడిన అపార్థం తొలగిపోయింది.

— వాసాల నర్సయ్య

ఏప్రిల్ నెల

బొమ్మల సంభాషణ ఫలితాలు



భర్త: తలపై నీవు కొట్టే దెబ్బల వల్ల వచ్చే బుడిపెలకు రోజూ ఆఫీసులో ఏదో ఒక పెద్ద కథ అల్లి చెప్పలేక పోతున్నానే! అందుకే యిలా....!

— కె. బుచ్చిరాజు, విశాఖపట్నం.

* * *

భార్య: ఇంట్లో కూడా హెల్మెట్ ఎందుకు?

భర్త: ఈ యేడు బయటకంటే ఇంట్లోనే ఎక్కువ ప్రమాదాలు జరగవచ్చని శాస్త్రిగారు చెబితేనూ... ?

— వి. నాగేష్, విశాలాక్షి నగర్.

* * *

భర్త: నిన్న నువ్వు టి.విలో వంట చేయడం ఎలా అన్న ప్రోగ్రాం చూసినప్పుడే హెల్మెట్ కొన్నాను.

— పి. ప్రసాద్, విజయవాడ.

భర్త: ఈరోజు నువ్వు ఏ కోరిక కోరినా ఫర్వాలేదు. కోరుకో.

భార్య: తలని కాపాడుకున్నందుకు సంబరపడుతున్నారా.... ఆ లడ్డూలు తినండి. నేను కొత్తగా తయారు చేశా. ఎలా ఉన్నాయో చెప్పండి. ముందు.

— కె. విజయ, కర్నూలు.

* *

భార్య: అన్నం తినేటప్పుడు కూడా ఆ హెల్మెట్ ఎందుకండీ?

భర్త: ఈ సంవత్సరం నా జాతకం ప్రకారం తలకి ప్రమాదమన్నారు. కనుక ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో చెప్పలేం కనుక ఈ జాగ్రత్త.

వి. రాజు, కడప.



ప్రశ్న: **కత్తి లేకుండా శస్త్రచికిత్స సాధ్యమా?**

జవాబు: లార్స్ లెక్సెల్ అనే శాస్త్రజ్ఞుడు గామాకిరణాలను సంఘటిత పరిచి పదునైన చాకులా రూపొందించగలిగాడు. ఈ గామా చాకుతో మెదడుపై కూడా శస్త్రచికిత్స జరుపవచ్చును. దీనివల్ల శరీరానికి కోత ఉండదు. రక్తం చిందదు. మెదడులో గెడ్డల్ని కూడా తొలగించవచ్చు. శస్త్రచికిత్స జరిగిన కొద్ది గంటల్లో రోగి నడిచివెళ్ళిపోవచ్చు. దీనిని లెక్సెల్‌గామా చాకు చికిత్స అంటారు. ప్రమాదరహితమైన ఈ శస్త్రచికిత్సకు ప్రస్తుతం అయ్యే ఖర్చు మాత్రం చాలా ఎక్కువ. సింగపూర్లోని గామా చాకు కేంద్రంలో ఈ శస్త్రచికిత్సకయ్యే ఖర్చు నాలుగు లక్షల రూపాయల దాకా ఉండవచ్చునట. ఈ చాకు ఖరీదే దగ్గర దగ్గర ఇరవై కోట్లు ఉంటుంది మరి!

ప్రశ్న: **బంబుల్ బీస్ అనే ఒక రకం తేనెటీగలు పిల్లు లెక్కువగా ఉండేచోట ఉంటాయి. కారణమేమిటి?**

జవాబు: ఈ రకం తేనెటీగలు నేలలోని పగుళ్ళలో తమ గూళ్ళను కట్టుకుని గుడ్లు పెడతాయి. ఎలుకలా ప్రాంతాలు తవ్వి గూళ్ళను తీసి వాటిలోని గుడ్లను, తేనెను కూడా స్వాహా చేస్తాయి. పిల్లులు ఎలుకల్ని వేటాడి తింటాయి కదా! అందుకని పిల్లులెక్కువగా ఉన్నచోట ఎలుకల సంఖ్య తగ్గిపోతుంది. ఆ కారణంగా తేనెటీగల గూళ్ళు చాలావరకూ మిగిలిపోతాయి. అందుకే ఈ తేనెటీగల సంఖ్య పెరుగుతుంది.

ప్రశ్న: **రేడియో తరంగాలు గాలిలోంచీ అంతరిక్షంలోకి పోకుండా భూమ్మీదే ఒక చోటునుంచి మరో చోటుకి ఎలా వెడతాయి?**

జవాబు: మర్కోనీ 1901లో ఇంగ్లండులోని ఒక ప్రాంతంనుంచి అమెరికాలోని మరో ప్రాంతానికి తొలిసారిగా రేడియో తరంగాల ద్వారా సందేశాన్ని పంపినపుడు శాస్త్రజ్ఞులు కూడా ఆశ్చర్యపోయారు. రేడియో తరంగాలు అంతరిక్షంలోకీ ఎందుకు పోలేదా అని! అయితే అసలు విషయాన్ని అవలర్ హెవీసైడ్ అనే శాస్త్రజ్ఞుడూహించాడు. భూమి వాతావరణపుటుపరితలంలో విద్యుద్వాహకాలైన పదార్థాల ధూళితో నిండిన పొర ఒకటి ఉన్నది. రేడియో తరంగాలా పొరకు తగలగానే భూమ్మీదకు ప్రతిఫలిస్తాయి. అవి తగిలిన కోణాన్ని బట్టి వెనక్కు మళ్ళే కోణమూ ఉంటుంది. ఇదే విషయాన్ని అమెరికాకు చెందిన ఆర్థర్ కెన్నెల్లీ కూడా ఊహించాడు. ఆ తర్వాత రెండు దశాబ్దాలకు ఎడ్వర్డ్ ఆపిల్‌టన్ అనే బ్రిటిష్ శాస్త్రజ్ఞుడు వాతావరణంలో అలాంటి పొర ఉన్నట్లు ధృవీకరించాడు. అప్పట్నించీ దానిని "కెన్నెల్లీ - హెవీసైడ్" పొర అంటున్నారు.

"వసుంధర"

ప్రశ్న: ముసలివాళ్ళకు క్షణం క్రితం జరిగినవి గుర్తుండవు కానీ ఏళ్ళ క్రితం జరిగినవి గుర్తుంటాయి. ఎలా?

జవాబు: మనిషి జ్ఞాపకశక్తి మెదడులో ఏవిధంగా నద్దుకుందో చెప్పడం కష్టం. అయితే మనస్తత్వ శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం మెదడులో శాశ్వత జ్ఞాపకాలకీ, తాత్కాలిక జ్ఞాపకాలకీ వేర్వేరు స్థానాలుంటాయి. మెదడులో దెబ్బతిన్న భాగాలను బట్టి జ్ఞాపకశక్తి పోవడం ఉంటుంది. ముసలివాళ్ళ మెదడులో సాధారణంగా తాత్కాలిక జ్ఞాపక స్థానం దెబ్బతింటుంది.

ప్రశ్న: ఉష్ణం - వేడి పదార్థాల నుంచి చల్లటి పదార్థాలకు పాకుతుందని అంటారు. మన శరీర ఉష్ణోగ్రత 37°. కానీ వాతావరణంలో 35° ఉంటే చాలు మనం చాలా ఇబ్బందిగా వేడిగా ఫీలవుతాం. ఎందుకని?

జవాబు: ఉష్ణ ప్రవాహంలో శరీరోష్ణ ప్రవాహ రీతి వేరు. మన శరీరానికి విధులు సక్రమంగా నిర్వహించబడాలంటే ఎప్పుడూ 37° ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే శరీరానికి చెమట పడుతుంది. చెమట పట్టడంతో శరీరోష్ణోగ్రత తగ్గుతుంది. ఈ చెమట వెంటనే ఆవిరి కాకపోతేనే మనకు ఇబ్బంది అనిపిస్తుంది. వాతావరణంలోని గాలిలో తేమ ఎక్కువుంటే చెమట ఆవిరికాక మనకు ఉక్క పోసినట్లుండి ఇబ్బంది పడతాం. గాలిలో తేమ తక్కువుంటే చెమట ఆవిరైపోవడంతో హాయిగా ఉంటుంది. మనకు ఇబ్బంది పెట్టేది గాలిలో తేమ మాత్రమే. వాతావరణ ఉష్ణోగ్రత కాదు. అయితే ఈ ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటిందంటే మాత్రం మనకు ఇబ్బంది తప్పదు. అప్పుడు శరీరానికి బయటి వేడి తెలుస్తుంది. అది చలికాలంలో చలి వేయడం వంటిదే!



ఈ ప్రక్కనున్న బొమ్మలోని వాళ్ళు ఏం మాట్లాడుకుంటే నవ్వు వస్తుందో, ఆ సంభాషణ వ్రాసి, ఈ సంచిక విడుదలైన పది రోజులలోగా మాకు పంప కోరుతున్నాం. వాటిలో బాగున్న అయిదింటిని ఎన్నుకొని ఒక దానికి రూ. 15/- పంపుతాం. సంభాషణలు కార్డుమీద మాత్రమే వ్రాసి పంపాలన్నది షరతు.

బొమ్మల సంభాషణ

80, ధనలక్ష్మి కాలనీ, వడపళని, మద్రాసు - 26.

Edited and published by Vijaya Bapineedu, 80, Dhanalakshmi Colony, Madras - 26. Phone: 4844499 and Printed by N. Navin Chandran, at S.R. Offset Art Printers, Madras - 21. Phone: 5226462.

BOMMARILLU JUNE 1997 Regd No. M-8914

